ప్రజాశక్తి

బుధవారం 21 జూన్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





పలకరించిన తొలకరి



విజయవాడలో కురుస్తున్న వర్షం

- పగటి పూట తీవ్ర ఎండ...
- సాయంత్రం చల్లబడ్డ వాతావరణం
- చిరుజల్లులతో రైతుల హర్షం
- తొలకరి సాగుకు సిద్ధం

ప్రజాశక్తి-కంచికచర్ల, విజయవాడ

ఎట్టకేలకు 20 రోజులు ఆలస్యంగా తొలకరి జల్లు పలకరింపుతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ ఏడాది మృగశిర కార్తె పూర్తయినా ఇప్పటి వరకు చినుకు జాడ లేదు. ఎండ తీవ్రత, ఉక్కపోతతో జనం అల్లాడి పోయారు. తొలకరి సాగు కూడా ఆలస్యమైంది. తొలకరి సాగుకు పొలాలు దుక్కులు దున్ని సిద్ధం చేసిన రైతులు వర్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూశారు. మంగళవారం పగటి పూట కూడా ఎండ తీవ్రత 43 డిగ్రీలు నమోదై, తీవ్ర ఉక్కపోసింది. ఇంతలోనే సాయంత్రం 4 సమయం లో ఆకాశం ఒక్కసారిగా మబ్బులు పట్టి చీకట్లు కమ్మింది. ఉరుములు, మెరుపులు మెరిశాయి. ఇంతలో తేలికపాటి జల్లులు కురిసింది. ఇప్పటికే ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని తిరువూరు, నందిగామ, విజయవాడ, మచిలీపట్నం, ఉయ్యూరు, గుడివాడ రెవెన్యూ డివిజన్ల పరిధిలో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. డెల్టా ప్రాంతమైన కృష్ణాజిల్లాలోని పలు మండలాల్లో ఇప్పటికే వరి సాగునిమిత్తం నారుమళ్లు సైతం పోశారు. మంగళవారంనాడు ఎన్‌టిఆర్ జిల్లాలోని కంచికచర్ల, వీరులపాడు, నందిగామ, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడినట్లైందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తొలకరి సాగు కోసం పొలాలను గుల్లగా దున్ని సిద్ధం చేశారు. వాతావరణం ఇలానే చల్లబడి భారీ వర్షం కురిస్తే మెట్ట పంటలైన పెసర, మినుము, మొక్కజొన్న, నువ్వు, కంది, తో పాటు పత్తి పంట సాగు చేయటానికి రైతులు సిద్ధమౌతున్నారు. విత్తనాలు కొనుగోలుకు పెట్టబడులు సైతం సిద్ధం చేశారు.

వర్షంతో సేదతీరిన విజయవాడ ప్రజలు

గత రెండు నెలలుగా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న విజయవాడ ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు నైరుతి రుతుపవనాలు కాస్త ఉపశమనం కలిగించే సంకేతాలు అందించాయి. ఈ నెల 11 నుంచి కర్ణాటక-ఏపీ సరిహద్దుల వద్ద నిలిచిపోయిన రుతుపవనాల్లో కదలిక (మిగతా 6లో)

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలంలోని చీమలపాడు గ్రామానికి చెందిన తుళ్లూరు రామారావు(54) మంగళవారం పిడుగుపాటుకు గురై దుర్మరణం చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం తుళ్లూరు రామారావు ఇబ్రహీంపట్నం- జగదల్ పూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న పంట పొలాల్లో గేదెలు మేపుతుండగా అకస్మాత్తుగా ఉరుములు మెరుపులు, ఈదురుగాలితో కూడిన భారీ వర్షం కురవటంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగుపడింది. ఈ పిడుగుపాటుకు గేదెలు మేపుతున్న రామారావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మతదేహాన్ని జడ్ పి టి సి భూక్యాగనియా, సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు, ఎంపీటీసీ కోలా నాగమణి నరసింహారావు, టిడిపి గ్రామ అధ్యక్షుడు బెజవాడ శంకర్, సిపిఐ, సిపిఎం నాయకులు మేకల డేవిడ్,పానెం ఆనందరావు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.



వైద్యశాల వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల నేతలు, కార్యకర్తలు

అత్యాచార నిందితుడిని శిక్షించాలి

పాత ప్రభుత్వాసుపత్రి వద్ద మహిళా సంఘాల నిరసన

ప్రజాశక్తి-విజయవాడ: అనాథ బాలికపై రెండేళ్లుగా అత్యాచారం చేస్తున్న విశాఖ జ్ఞానానంద ఆశ్రమం నిర్వాహకుడు పూర్ణానంద స్వామీజీపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా, టిడిపి అనుబంధ మహిళా సంఘం నాయకులు విజయవాడ పాత ప్రభుత్వ వైద్యశాల వద్ద మంగళవారం నిరసనకు దిగారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం పాత ప్రభుత్వ వైద్యశాలకు తరలించారన్న విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న మహిళా సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. బాలిక ఉన్న వార్డులోకి వెళ్లనీయకుండా ముందస్తుగానే పోలీసులు రక్షణ వలయం ఏర్పాటు చేశారు. అయినా సరే ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, కొంతమంది టిడిపి అనుబంధ మహిళా సంఘం నేతలు లోపలికి వెళ్లగా బాలిక కనిపించలేదు. బాలిక ఎక్కడుందని పోలీసు సిబ్బందిని మహిళా సంఘాల నేతలు ప్రశ్నించగా ఇక్కడ లేదని, వైద్య పరీక్షల కోసం కొత్త ఆస్పత్రికి తరలించారని సమాధానం ఇచ్చారు. బాలికను ఎవరూ కలవకూడదని ఎక్కడ ఉన్నది సమాచారాన్ని పోలీసులు, వైద్యాధికారులు గుట్టుగా ఉంచారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, టిడిపి అనుబంధ మహిళా సంఘం విజయవాడ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉషారాణి మాట్లాడుతూ అనాథ బాలికను అనాగరికంగా, దారుణంగా హింసిస్తూ రెండు సంవత్సరాల నుంచి అత్యాచారానికి పాల్పడిన విశాఖ జ్ఞానానంద ఆశ్రమ నిర్వాహకులు పూర్ణానంద స్వామీజీని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్వామీజీల ముసుగులో బాలికలు, మహిళలపై అత్యాచారాలు జరపడం ఇటీవల కాలంలో పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాసలీలలకు, అనైతిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్న దొంగస్వామీజీల ఆశ్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగు చూస్తాయన్నారు. తక్షణం పూర్ణానంద స్వామీజీ (మిగతా 6లో)

లంకా కాళిదాసుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-గుడివాడ

సిపిఎం సీనియర్ నేత, కార్మిక నాయకుడు లంకా కాళిదాసు అంతిమయాత్ర మంగళవారం కన్నీటివీడ్కోలు మధ్య జరిగింది. గుడివాడ పట్టణానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు, కార్మిక నేత లంకా కాళిదాసు (85) సోమవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం అంతిమ యాత్ర జరిగింది. సిపిఎం, వైసిపి, టిడిపి నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు సిపిఎం సీనియర్ నాయకులు నీలం మురళీష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బిఆర్ తులసీరావు మాట్లాడుతూ 1972లో ఉద్యోగ రీత్యా పామర్రు వచ్చినప్పుడు కాళిదాసుతో మంచి సంబంధాలు ఏర్పడ్డాయన్నారు. తుదిశ్వాస విడిచే వరకూ తాను నమ్మిన సోషలిజం సిద్ధాంతం కోసం కమ్యూనిస్టు పార్టీలోనే ఉన్న కాళిదాసు జీవితం సార్థకమైందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా కమ్యూనిస్టుగా పేదల హక్కుల కోసం తీవ్రమైన పోరాటం చేశారన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా కాళిదాసును తీసుకోవాలన్నారు. రాష్ట్ర రైతు సంఘం నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ కాళిదాసు పెద్దగా చదువుకోకపోయినా ఎప్పుడు చూసిన పుస్తకాలు (మిగతా 6లో)





కాళిదాసుకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు



కట్టలేరు వంతెనను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు మధు

కట్టలేరు వంతెన నిర్మాణ సాధనలో

జైలుకెళ్లడానికైనా సిద్ధం

సిపిఎం సీనియర్ నాయకులు మధు

ప్రజాశక్తి - గంపలగూడెం

గంపలగూడెం కట్టలేరు వంతెన నిర్మాణ సాధన కోసం పోరాడతామనీ, అవసరమైతే జైలుకెళ్లటానికి కూడా సిద్ధమని సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు హెచ్చరించారు. ఈ వంతెన 2018లో వచ్చిన అధిక వర్షాలకు ధ్వంసమైంది. అప్పటినుండి నేటి వరకూ పాలకులు దానిని పట్టించుకున్న నాథుడే లేడు. దీనివలన బ్రిడ్జికి రెండువైపులా దాదాపు 30 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల గంపలగూడెం వచ్చిన సందర్భంగా ధ్వంసమైన కట్టలేరు వంతెనను మధు పరిశీలించారు. ఈ నేపథ్యంలో దీని నిర్మాణ సాధనకై ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ గంపలగూడెం మండలంలో మంగళవారం సిపిఎం గంపలగూడెం మండలం కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. పి.మధు విశిష్ట అతిథిగా హాజరై పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. గత మూడు నెలల క్రితం స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తిరువూరు వచ్చిన సందర్భంగా గంపలగూడెం కట్టలేరుపై వంతెన నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారన్నారు. అయినప్పటికీ నేటికీ ఆ నిధులు మంజూరు కాలేదన్నారు. ఈ వంతెన పై అనేక గ్రామాల ప్రజలు, రైతులు, వ్యాపారులు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారన్నారు. వీటన్నింటికి మించి అత్యవసర (మిగతా 6లో)

విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-ఎ.కొండూరు : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం రెండుసార్లు తప్పిందని మనస్థాపం చెంది విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎ.కొండూరు మండలంలో జరిగింది. ఎన్టీఆర్ జిల్లా ఎ. కొండూరు మండలం చైతన్య నగర్ తండా గ్రామ పంచాయతీకి చెందిన భూక్యా కోటేశ్వరరావు, రంగమ్మల కుమార్తె పల్లవి (18) మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివింది. 2022- 23 విద్యా సంవత్సరంలో మొదటిసారిగా రాసిన పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో, సప్లిమెంటరీ కట్టి పరీక్షలు రాసింది. ఈ పరీక్షల్లో కూడా పల్లవి తప్పడంతో తీవ్ర మనస్థాపానికి గురై సోమవారం సాయంత్రం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను తల్లిదండ్రులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు బాలిక తల్లిదండ్రులు తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ ఐ ఎ.అంకారావు తెలిపారు. పల్లవి మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉరేసుకొని యువకుడు మతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మద్యానికి బానిసై అనారోగ్యంతో యువకుడు ఉరి వేసుకుని మతి చెందిన సంఘటన పట్టణంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు పట్టణానికి చెందిన గండికోటి సతీష్ (20) హెూటల్లో పనిచేస్తుంటాడు. తన తండ్రి 20 రోజుల క్రితం అనారోగ్యంతో బాధతో చనిపోగా ఆ బాధతో మద్యం తాగడం, అలాగే భార్య పుట్టింటికి వెళ్ళగా మతిస్థిమితం కోల్పోయి మద్యానికి బానిసై ఒంటరిగా ఇంట్లో ఉంటూ తాగిన మైకంలో ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందాడు. మృతదేహం వేలాడుతుండగా వారి బంధువు నాగమణి, చుట్టుపక్కల వారు వచ్చి అతని కిందకు దింపి హాస్పిటల్ తీసుకెళ్లగా చనిపోయినట్లు అతని తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బివి రామారావు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : నియోజకవర్గంలో పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను అందజేశారు. మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశం కార్యక్రమంలో చెక్కులను అందజేశారు. జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన గాదే సురేష్ కుమార్తె కు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న విషయాన్నిఉదయభాను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి వారి కుమార్తెకు వైద్య ఖర్చుల నిమిత్తం 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు చేయడం జరిగింది. అదేవిధంగా జగ్గయ్యపేట పట్టణం సీతారామపురం యాదవ్ బజార్ కు చెందిన భయ్యా లింగ బాబు కుమార్తెలైన భయ్యా సుప్రియ, భయ్యా హరిప్రియ వీరిద్దరికీ పుట్టుకతో చెవుడు కారణంగా కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ద్వారా ఆ ఇద్దరు పిల్లలకు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి 2 లక్షల 60 వేల రూపాయల చొప్పున ఇద్దరు పిల్లలకు 5 లక్షల 20వేల రూపాయల మంజూరు పత్రాన్నిఉదయభాను లబ్ధిదారునికి అందించడం జరిగింది.

జగనన్న సురక్షపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై మండలస్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ గాంధీ, తహసీల్దార్ లక్ష్మి కళ్యాణి, ఎంపీడీవో ప్రసాదరావు ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం గురించి మండల పరిధిలోని పంచాయతి కార్యదర్శులు , వి ఆర్ వొ లు ,వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్ , పంచాయతి కార్యదర్శులు, పలువురు అధికారులకు అవగాహన కల్పిస్తూ, కార్యక్రమ ఉద్దేశ్యం పై పలు సూచనలు సలహాలు అందించారు. ఈకార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా మట్టి తవ్వకాలు

- అనధికార తవ్వకాలపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి - తిరువూరు : ఒక సామాన్యుడు ఇంటి మెరకకు రెండు ట్రాక్టర్ ట్రిపులు మట్టితోలుకుంటా మంటే అనుమతివ్వని తహశీల్దార్ ఎమ్మెల్యే బావమరిది చెప్పితే మాత్రం అధికారపార్టీ నాయకులకు, ప్రజా ప్రతి నిధులకు చెరువులో అక్రమ మట్టి తవ్వకాలకు అనధికారిక అనుమతిస్తున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఫలితంగా తిరువూరు మండలంలోని కోకిలంపాడు, ఆంజనేయ పురం, చిట్టెల, చౌటపల్లి, లక్ష్మీపురం, కాకర్ల తదితర గ్రామాల్లో మట్టి వ్యాపా రాన్ని అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు జోరుగా సాగిస్తున్నారు. కాలనీ ఇళ్ల నిర్మాణానికి, రైతుల పొలా ల్లోకి మట్టికావలని చెబుతున్న అక్రమా ర్కులు ఇటుక బట్టీలకు, పెద్ద భవనాల నిర్మాణాలకు మట్టిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు బహిరం గంగా చెబు తున్నారు. కోకిలంపాడు చెరువులో మట్టిని ఆగ్రామంలోని పలువురు వైసి పి నాయకులు సరిహద్దు తెలంగా ణా గ్రామాలైన సంబునిగూడెం, కొండెగట్ల లోని ఇటుక బట్టీలకు వందలాది ట్రిప్పు లు తరలించారని గ్రామస్తులు చెబుతు న్నారు. తమ పొలాలకు మట్టి తోలు కుంటామంటే ఇవ్వని తహశీల్దార్ ఇటు క బట్టీలకు ఎలా అనుమతిచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే బావమరిది చెబితేనే తహశీల్దార్ అను మతిస్తున్నారని తెలిపారు. పేదల ఇళ్ల స్థలాల మెరక పేరుతో ఇటుక బట్టీలకు, ఇతర ప్రాంతాలకు అంజనేయపురం చెరువులో మూడు జేసిబిలతో మంగళ వారం యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని తహశీల్దార్ ను ప్రజాశక్తి అడిగితే ఎవరైనా వచ్చి రాత పూర్వకంగా పిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానన్న ఆయన అసలు చెరు వుల బాధ్యత మాదికాదని, ఇరిగేషన్, పంచాయతీ అధికారు లదని సమాధానం చెప్పారు. ఇదే విషయాన్ని ఇరిగే షన్ ఎఈని అడిగితే నాకేమీ తెలియ దు, కొత్తగా వచ్చానని చెప్పారు. చౌటపల్లి చెరువులో అయితే రాత్రి వేళలో మట్టిని తోలుతున్నా ఎవరొచ్చి అపుతారో రాని నేను చూసు కుంటాను, మట్టి తొలకాలను ఆపేదిలేదని ఆ గ్రామ మండల స్థాయి ప్రజాప్రతినిధి శపదం చేసినట్లు గ్రామ స్తులు తెలిపారు. ఇలా అధికా పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే బావమరిది అండదండలతో చెరు వుల్లో మట్టిని అక్రమంగా తరలిస్తున్నా మామూళ్ల మత్తులో ఉన్న అధికారులు చర్యలు తీసుకోవడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం విమర్శిస్తున్నారు.

ఎంపిపి వ్యాఖ్యలపై సర్పంచ్ ఖండన

ప్రజాశక్తి కంచికచర్ల : పెండ్యాల గ్రామం అభివద్ధికి నోచుకో పోపటం కేవలం అధికార పార్టీకి చెందిన వైసిపి ఎంపీపీ వ్యవహార శైలి కారణమని గ్రామ సర్పంచ్ మల్లిక భాను ఆవేదన వ్యక్తం చేశారు. పెండ్యాల గ్రామంలో టిడిపి మద్దతు తో సర్పంచ్ గా ఒక మైనారిటీ మహిళనై ఉండటాన్ని అధికార పార్టీకి చెందిన ఎంపిపి, ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాభివద్ధికి పెండ్యాల సర్పంచ్ సహకరిం చటం లేదని ఎంపిపి చేసిన వ్యాఖ్యలను సర్పంచ్ మల్లికా భాను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆమె స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. రాష్ట్రమంతా వైసిపి పాలన నడుస్తున్న పెండ్యాల గ్రామంలో టిడిపి మహిళ సర్పంచ్ నైన నన్ను ఎన్నో అవమానాలకు గురిచేస్తూ కనీసం ప్రోటోకాల్ కూడా పాటించకుండా ఎంపిపి ఒంటెద్దు పోకడ పోతున్నారని ఆరోపించారు. గ్రామపంచాయతీ అభివద్ధి కోసం ఆహోర్నిశలు శ్రమిస్తున్న కనీసం పంచాయతీ పన్నులు వసూలు చేయటానికి కూడా గ్రామ సెక్రెటరీని పన్నుల వసూళ్లకు సహకరించకుండా చేసింది ఎవరో మీకు తెలియదా.అని ప్రశ్నించారు. పంచాయతీలో నిధులు లేకుండా పంచాయతీ పన్నులు వసూలు చేయకుండా అడ్డు పడ్డది మీరు కాదా, పంచాయితీ సిబ్బందికి జీతభత్యాలకు ఇంతవరకు టెండరు పిలవకుండా నిలిపినది ఎవరు? టెండర్లకు పిలవకుండా పంచాయితీ సిబ్బందికి జీతాలు రాన్వికుండా చేసింది మీరు కాదా అని ఆమె ప్రశ్నించారు.. గ్రామంలో అభివద్ధికి ఎవరు అడ్డుపడుతున్నారో మాట్లాడదామంటే బహిరంగంగానే మాట్లాడదాం రండి మేము సిద్ధంగా ఉన్నామని సర్పంచ్ సవాల్ విసిరారు.

నైపుణ్య శిక్షణ భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని ఐదవ వార్డు సమీపంలో శరవేగంగా నైపుణ్య శిక్షణ భవనం నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్థానిక కౌన్సిలర్ వట్టెం మనోహర్ తెలియజేశారు. సుమారు 70 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ తో కలిసి పరిశీలించారు. అతి త్వరలోనే నైపుణ్య శిక్షణ భవనం పట్టణ వాసులకు అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే ఉదయభానుకు, ఎంపీ కేశినేని నాని లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగవ వార్డు సచివాలయ కన్వీనర్ చిరంజీవి, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఖాదర్ బాబు, కౌన్సిలర్ కొలగాని రాము, వైసిపి నేతలు కన్నెమాల శామ్యూల్, గంద్రాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎంసెట్ ర్యాంకర్ వరుణ్ కు సన్మానం

ప్రజాశక్తి -నందిగామ : నందిగామ ఖ్యాతి ని రెండు తెలుగు రాష్ట్రాలలో ఆంధ్రాలో ఇంజనీరింగ్ విభాగంలో ప్రథమ రాంక్, తెలంగాణ లో మూడవ రాంక్ సాధించడం తో పాటు జైఈఈ అడ్వాన్సుడ్‌లో 179 ర్యాంకు సాధించిన చల్లా ఉమేష్ వరుణ్ మంగళవారం నందిగామ భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి వారు సత్కరించారు. వరుణ్‌ను కార్యక్రమంలో నందిగామ భగవాన్ సత్య సాయి సేవ సమితి కన్వీనర్ యు వాసుదేవరావు, తుర్లపాటి కోటేశ్వర రావు , కొత్త సంగమేశ్వర రావు , సుశీల ,రవీంద్ర బాబు , చిట్టెమ్మ , సమితి సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ వేమాకు ఘన నివాళి

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల కు చెందిన ప్రముఖ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వేమా పేరయ్య నాయుడు ద్వితీయ వర్ధంతి ని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. డాక్టర్ వేమా పేరయ్య నాయుడు కుమారుడు నరేన్, కుమార్తె నర్మద ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్ లో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా ఆయన చిత్ర పటానికి పట్టణ వైసిపి అద్యక్షుడు గ్రామ ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు తదితరులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కంచికచర్ల, వీరులపాడు మండలాలతో పాటు జిల్లాలో పలు చోట్ల ప్రభుత్వం వైద్య వత్తిలో వేమా విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేమా వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు దేవిరెడ్డి శ్రీనివాసరావు, వాసు, గ్రంధి ఆదిత్య, మధు, పొన్నపూల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణ పరిధిలో హనుమంతుపాలెంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎస్ జయరాం పర్యటించారు. వార్డులోని ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, పారిశుధ్య పనులను పరిశీలించారు. మురుగు నీరు నిల్వ వుండకుండా చూసుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్ పనులను నిర్వహించి దోమలను లార్వా దశలోనే నిర్మూలించే విధముగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వార్డ్ లో ఉన్న రక్షిత మంచి నీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలించారు. మంచినీటి సరఫరా అయ్యే సమయాలను అడిగి తెలుసుకొని, రికార్డులను పరిశీలించారు. వాటర్ ట్యాంక్ లో నీటిని తీసుకొని స్వయముగా క్లోరిన్ టెస్ట్ నిర్విహించారు. వార్డులోని అన్నీ వీధులలో పారిశుధ్య పనితీరు, డ్రెయిన్ల నందు మురుగు నీరు పారుదల విధానము మరియు ఇంటింటి చెత్త, పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి పరిసరాలు పరిశుభ్రముగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమ లోసచివాలయ శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రాస్ కట్టర్ మిషన్లు కొనుగోలు

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు మార్జిన్ లో పెరిగిన పిచ్చి కంపలను పిచ్చి చెట్లను తొలగించుటకు రెండు గ్రాస్ కట్టర్ మిషన్లను ఏపీ అగ్రోస్ వారి వద్ద నుంచి రూ.60వేలకు కొనుగోలు చేసినట్లు కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు ఈ మిషన్లు వర్షాకాలంలో రోడ్డు మార్గంలో పెరిగిన కంపలను తొలగించడానికి వినియోగించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, పురపాలక సంఘం స్పెషల్ ఆఫీసర్ మంజూరు మేరకు ఈ మిషన్‌ను కొనుగోలు చేసినట్లు ఆయన తెలియజేశారు.

పేదల ఇళ్లు తొలగించడం తగదు

ప్రజాశక్తి -నందిగామ : నందిగామ పాత బస్టాండ్ కోనేరు పక్కన నివాసం ఉంటున్న తమకు అధికారులు న్యాయం చేయాలని వరికొల్లు భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కోనేరు ఆక్రమణలు తొలగిస్తున్న నేపథ్యంలో అధికారులు తమ ఇల్లు తొలగించాలని నోటీసులు ఇచ్చారన్నారు. కానీ తాము ఎన్నో సంవత్సరాల నుండి పక్కా భవనం నిర్మించుకొని తలదాచు కుంటున్నామని ,తమకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా ఇల్లు తొలగించాలనుకోవడం తగదన్నారు. నందిగామ పట్టణంలో పలువురు బడా వ్యక్తులు భూకబ్జాలకు పాల్పడుతున్నా, అడ్డగోలుగా ఆక్రమణలు చేస్తున్నా, అక్రమ కట్టడాలు చేపడుతున్నా పట్టించుకోని అధికారులు పేద ప్రజలు నివసించే ఇళ్లను తొలగించడానికి అడ్డగోలుగా నోటీసులు ఇచ్చి ఆక్రమణ తొలగించడం సరికాదన్నారు.

బీసీ సెల్ అధ్యక్షుడిగా 'చాపల'

ప్రజాశక్తి- జగ్గయ్యపేట : పట్టణానికి చెందిన చాపల వెంకటేశ్వర్లు ను జగ్గయ్యపేట మండల వైసీపీ బీసీ సెల్ అధ్యక్షులుగా నియమిస్తున్నట్లు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలియజేశారు. కాగా ముదిరాజు సామాజిక వర్గానికి చెందిన చాపల వెంకటేశ్వర్లు గతంలో రాష్ట్ర ముదిరాజ్ యువసేన వర్కింగ్ ప్రెసిడెంట్ గా, జగ్గయ్య పేట నియోజకవర్గ బీసీ సంఘం యూత్ అధ్యక్షులుగా పనిచేశారు. తనపై నమ్మకంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో బాధ్యత కల్పించిన సామినేని ఉదయభాను కు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

లస్సీ పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాటసారులకు పాదచారులకు మంగళవారం చల్లటి తీయటి లాసిని అందజేశారు. గరికపాటి సునీల్ పుట్టినరోజు సందర్భంగా పద్మశాలి సంక్షేమ సంఘం చలివేంద్రంలో 51వ రోజు మూడువేల మందికి లస్సి ఉచితంగా అందజేశారు. సంఘ అధ్యక్షులు పెనుమల్లిచంద్రమౌళి, సెక్రటరీ భారత జగన్ సంఘ పెద్దలు ముసిని శివ, యలదండి శ్రీనివాసరావు, అల్లి రవిచంద్ పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఏపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

ప్రజాశక్తి.. గన్నవరం : గ్రామాల్లో రైతులకు ధాన్యం బకాయిలు వెంటనే చెల్లింపు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు డిమాండ్ చేశారు. గన్నవరం లోని రైతు సంఘ కార్యాలయంలో మండల స్థాయి విస్తృత సమావేశం జరిగింది. రైతు సంఘం మండల అధ్యక్షులు శ్రీమన్నా రాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హరిబాబు మాట్లాడుతూ..గ్రామాల్లో రైతులు, కౌలుదారులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని గుర్తించి పరిష్కారం కోసం ఈనెల 30వ తేదీన విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమంలో రైతులు, కౌలు దారులు హాజరయ్యేలా చూడాలని చెప్పారు. ఆర్ బి కే కేంద్రాలకు ధాన్యం తోలిన రైతులకు ఇంకా బకాయిలు రావాల్సి ఉందని, రవాణా చార్జీలు కూడా పెండింగ్లో ఉన్నట్లు రైతులు చెబుతున్నారని, ఈ సమస్యలపై కూడా అధ్యయనం చేసి రైతులను ఉద్యమంలోకి తీసుకురావాలని చెప్పారు. ప్రభుత్వాన్ని నిలదీయకుండా సమస్యలు పరిష్కారం అయ్యే పరిస్థితి లేదన్నారు. ముఖ్యంగా కౌలుదారులు ఉపాధి పనులకు వెళ్తున్నారని వారికి పూర్తిస్థాయిలో వేతనం రావడం లేదని తెలిపారు. రోజుకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని, ఏడాదికి 200 రోజులు పనులు చూపించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ..రైతాంగం ఎదురుకుంటున్న సమస్యలను గుర్తించి వారిని చైతన్య పరిచేందుకు గ్రామ నాయకులు కృషి చేయాలన్నారు. ధాన్యం డబ్బులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతులతో సమావేశాలు జరిపి డబ్బులు వచ్చేందుకు అధికారులపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు.ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సూరగాని సాంబశివరావు, సంఘ నాయకులు అవుటపల్లి సాంబయ్య, నల్లూరి ధర్మారావు, జాస్తి శ్రీనివాసరావు, నక్క రామారావు తదితరులు పాల్గొన్నారు.



పూర్ణయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-కలెక్టరేట్ : పామర్రు పట్టణ దివంగత కమ్యూనిస్ట్ నేత పూర్ణయ్య 18వ వర్ధంతిని పామర్రులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బందరు రోడ్డు, స్థానిక నాల్గు రోడ్ల కూడలి, శ్యామల పురం, గుడివాడ రోడ్డు న గల 105 మంది నిరుపేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. పూర్ణయ్య అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. తొలుత పూర్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తాడిశెట్టి సాంబశివరావు, పంచాయతీ సభ్యులు టి కుమార్, యూత్ నేతలు సతీష్, పూర్ణయ్య, కుటుంబ సభ్యులు సౌమ్యప్రియ, పూర్ణ, టిడిపి నేతలు అంజిబాబు ప్రసాదు, జస్వంత్ నాగ్, ఘాత్రిక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

ప్రజాశక్తి-గన్నవరం : ఆంధ్రప్రదేశ్ క్రీడా పాఠశాల లో4, 5 తరగతి ప్రవేశానికి మంగళవారం గన్నవరం మండల స్థాయి ఎంపికలు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం లో నిర్వహించారు. మండల ఎంపిక కమిటీ సభ్యురాలు పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు నిమ్మగడ్డ రవీంద్ర భవాని ఎంపికలను ప్రారంభించారు. ఎత్తు బరువు, 800మీటర్లు పరుగు,30మీటర్లు పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్ తదితర క్రీడాంశా లలో ఎంపికలు నిర్వహించినట్లు ఎంపిక కమిటీ కన్వీనర్ ధనియాల నాగరాజు తెలిపారు. బాలురు మాత్రమే ఎంపికలకు హాజరు అయినట్లు, బాలికల ప్రాతినిధ్యం లేదని నాగరాజు తెలిపారు. ఎంపికలకు హాజరైన వారిలో ముగ్గురు బాలురు ఈ నెల23,24 తేదీలలో గుడివాడ లో జరిగే జిల్లా స్థాయి ఎంపికలకు అర్హత సాధించినట్లు నాగరాజు తెలిపారు. ఎంపిక కార్యక్రమం లో గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చిప్పా డ చంద్రశేఖరరావు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు మీరాసాహెబ్, రాజు పాల్గొని ఎంపికలు నిర్వహించారు.

పక్కాగృహం మంజూరు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకటేశ్వరరావుకు చెందిన గృహం ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయింది. వెంటనే స్పందించిన హౌసింగ్ ఏఈ జి.సురేంద్ర వెంకటేశ్వరరావుకు పక్కా గృహం నిర్మించుకోవడానికి ఎంపిక చేయగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు చేతులు మీదగా పక్కాగృహం మంజూరు పత్రాన్ని మంగళవారం వెంకటేశ్వరరావుకు అందించారు. ఘంటసాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, జడ్పీటీసీ తుమ్మల మురళీ, వైస్

పాపవినాశనంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామ సచివాలయం పరిధిలోని పాపవినాశనం ఎస్సీ కాలనీ, గొల్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వంలో వారికి అందిన సంక్షేమ పథకాలు వివరించి బుక్లెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, మండల పార్టీ కార్యదర్శి దిరిశం పిచ్చేశ్వరరావు, ఎఎంసి మాజీ డైరెక్టర్ కుంపటి శరత్ బాబు, కొడాలి, కొత్తపల్లి పిఏసీఎస్ ఛైర్పర్సన్లు పరుచూరి రామకృష్ణ, తాతినేని కృష్ణారావు, పార్టీ నేతలు కనగాల సురేష్, సొసైటీ ప్రెసిడెంట్ జి.కొండలు, చుట్టూరి రమేష్, కొలుసు రాంబాబు, సచివాలయం కన్వీనర్ డొక్కు యేసు ప్రసాద్, కొలుసు చంద్రశేఖర్, మొవ్వ దావీదు, ఆరేవరపు శ్రీను, గొరిపర్తి దినకర్, పడమట వీరకుమార్, దోనే వెంకటేశ్వరరావు, ఎస్సై కుడిపూడి శ్రీనివాసు, డిటి సిహెచ్.చిట్టిబాబు, ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్, హౌసింగ్ ఏఈ జి.సురేంద్ర, ఏపిఓ సురేష్, ఈఓ డి.రమాదేవి, గ్రామ సచివాలయం, పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ఎపిఎస్ఆర్టిసి మచిలీపట్నం బస్ డిపోలో 17వ బ్యాచ్ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ టి పెద్ది రాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో డ్రైవర్ల కొరత, నిరుద్యోగ యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా డ్రైవింగ్ శిక్షణ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి బ్యాచ్ నందు 16 మందిని మాత్రమే అవకాశం ఉందని అని అన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకొన్న వారికి 17వ బ్యాచ్ లో చేరుటకు అవకాశము ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎనిమిదవ తరగతి ఉత్తీర్ణత, ఎల్ఎంవి లైసెన్సు పొంది సంవత్సరం పూర్తి అయి ఉండాలన్నారు. ఫీజు రూ 23,600 మచిలీపట్టణం డిపోలో చెల్లించి హెవీ డ్రైవర్ శిక్షణ పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజరును సంప్రదించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రవాణా శాఖ, ప్రభుత్వ అగ్ని మాపక శాఖ, ప్రభుత్వ కార్పొరేషన్స్, వివిధ శాఖల సహకారంతో ఇప్పటి వరకు 16 బ్యాచులలో 261 మందికి శిక్షణ ఇచ్చి, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ హెవీ లైసెన్సు అందించినట్లు ఆయన తెలిపారు.

25న యాదవ వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నం విజయవాడ రోడ్డులోని లలిత కన్వెన్షన్ హాలులో జూన్ 25 వ తేదీ యాదవ వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు పల్లపాటి వెంకట్రావు (చినబాబు) వెల్లడించారు. స్థానిక గొడుగుపేటలోని బందరు నియోజకవర్గ యాదవ సేవా సంఘం కార్యాలయంలో మంగళవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని యాదవ కుటుంబీకులు వారి పిల్లల వివరాలను తెలియపరుస్తూ వివాహ పరిచయ వేదికలో పాల్గొనాలని కోరారు. దీని కోసం రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ 500 చెల్లించాలన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుందని ఫోన్ పే, గూగుల్ పే ఫీజు చెల్లించి వివరాలను వాట్సాప్లో పంపించ వచ్చున్నారు. బొర్రా శ్రీనివాస్ రావు, గొరిపర్తి రామ్మోహనరావు (రాము), మన్నెం వెంకటేశ్వరరావు, దేవన బోయిన వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సిసిఆర్సి కార్డులపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద రెవెన్యూశాఖ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.రామానాయక్ మాట్లాడుతూ కౌలు చేసే ప్రతీ రైతు విధిగా పంట సాగు హక్కు పత్రం పొందాలని, తద్వారా కౌలు రైతులు కూడా ప్రభుత్వం పథకాలకు అర్హత పొందుతారని తెలిపారు. సిసిఆర్ కార్డు పొందటానికి కౌలు రైతు తన సాగు చేస్తున్న రైతు పేరు, భూమి సర్వే నెంబర్ వివరాలను సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారికి తెలియపర్చిన యెడల తగు విచారణ జరిపి కార్డు మంజూరు చేస్తామన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ సిసిఆర్సి కార్డుల ద్వారా కౌలు రైతులకు సంవత్సరానికి రూ.13,500 రైతు భరోసా ద్వారా లబ్ది చేకూరుతుందని అన్నారు. సిసిఆర్సి కార్డు ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రాయితీపై అందించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.



కుష్టువ్యాధిపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా కుష్టువ్యాధి నిర్మూలన సాధ్యమని కాటూరు పీహెచ్ సీ వైద్యుడు ఎస్. శివరామకృష్ణ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం కుష్టు వ్యాధిపై ఆశావర్కర్లు, వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటికి వెళ్ళి ఎవరికైనా వ్యాధి లక్షణాలు ఉన్నాయోమో తెలుసుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి అవగాహన కల్పించి చికిత్స పొందేల చూడాలన్నారు. ఎంపీహెచ్ నాగార్జునబాబూరావు, సీహెచ్ దయామణి, సూపర్వైజ ర్ కంతేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పంట సాగు హక్కు పత్రంపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వడ్లమన్నాడు రైతు భరోసా కేంద్రం వద్ద పంట సాగు హక్కు పత్రం పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సిసిఆర్సి కార్డులు గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. భూ యజమానికి ఏ విధమైన ఇబ్బంది లేకుండా సాగుదారునికి సాగులో వచ్చే నష్టాలను గాని పంట ఉత్పత్తులను గాని నేరుగా ఆర్ బి కే ద్వారా అమ్ముకునే అవకాశం ఉందని ఇది రైతులు గమనించాలని జిల్లా వ్యవసాయ సలహా మండల సభ్యులు పెన్నేరు ప్రభాకర్ రావు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సునీల్ , మండల తాసిల్దార్ అబ్దుల్ రహమాన్ మస్తాన్ ,వడ్లమన్నాడు సర్పంచ్ జ్యోతిలత , ఎంపీటీసీ సభ్యులు దిలీప్ కుమార్ ,జిల్లా వ్యవసాయ సలహా , ఆర్ ఐ బేగం , వీఆర్వో, సచివాలయ వ్యవసాయ సహాయకుడు స్వామి, మరియు రైతులు, రైతు కూలీలు, వాలంటీర్స్ ,పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాల నగదు పంపిణీ

ప్రజాశక్తి- గుడ్లవల్లేరు : మండలంలోని వడ్లమన్నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణి ముత్యాలు కార్యక్రమంలో మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులకు నగదు, పతకాలు మంగళవారం అందజేశారు. మొదటి స్థానం పొందినధాత్రి శ్రీ వల్లికి(558) 3000 రూపాయలు నగదు సర్టిఫికెట్ బంగారు పతకం, రెండవ స్థానం పొందిన రాథోడ్ శారదకు (518)?2,000 నగదు సర్టిఫికెట్లు వెండి పత కం, మూడో స్థానం పొందిన సింగర్ శెట్టి మాధురి కు (508) వెయ్యి రూపాయల నగదు సర్టిఫికెట్టు కాంస్య పత కం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతిలత జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ప్రభాకర్ రావు, ఎంపిటిసి దిలీప్ కుమార్ విద్యా కమిటీ ఛైర్మన్ జి వెంకటేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యుత్ భారాలు తగ్గించే వరకూ పోరాటం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు



విజయవాడలో...

ప్రజాశక్తి-విజయవాడ : విద్యుత్ భారాలు ఆగాలంటే ప్రజాపోరాటం తప్పదని, దీనికి నగరంలోని ప్రజలు, ఆయా కాలనీల అసోసియేషన్లు, టాక్స్ పేయర్స్ తదితర అసోసియేషన్లు సంపూర్ణ మద్దతునిచ్చి పాల్గొనాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు పిలుపునిచ్చారు. సిపిఎం విద్యుత్ పోరుబాట పాదయాత్ర కార్యక్రమం మూడవ రోజు సెంట్రల్ నియోజకవర్గంలోని 1వ డివిజన్ గుణదల కాలవ కట్టలపై, లెనిన్ నగరం, గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లో జరిగింది. ఇంటింటికీ, వీధి వీధికీ తిరుగుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు కరపత్రాలను పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. అత్యధికంగా వచ్చిన విద్యుత్ బిల్లులు, అధిక భారాలు సిపిఎం నాయకుల దృష్టికి స్థానిక ప్రజలు తీసుకొచ్చి, తీవ్ర ఆందోళన, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమానుద్దేశించి బాబూరావు మాట్లాడుతూ...విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం, వామపక్షాలు నిర్వహిస్తున్న ఉద్యమానికి రాజకీయాలకతీతంగా ప్రజలు ముందుకు వచ్చి మద్దతునివ్వాలని కోరారు. జగన్, మోడీ పాలనలో సర్వం బాదుడేనని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు తమ గొప్పతనం అని చెప్పుకునే వైసిపి నేతలు, విద్యుత్ భారాలపై ఎందుకు బాధ్యత వహించరని ప్రశ్నించారు. విద్యుత్ రంగంలో కార్పొరేట్ల దోపిడీ ఆపకపోతే భవిష్యత్తు అంధకారమేనని ఆందోళన వ్యక్తం చేశారు. అభివద్ధిని విస్మరించి, భారాలు మోపటంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మునిగి తేలుతున్నాడని విమర్శించారు. నిరుపేదలు సైతం పెరిగిన విద్యుత్ బిల్లులతో బెంబేలెత్తుతున్నారని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల నుండి అదనపు లోడ్ డిపాజిట్లు పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదానీ స్మార్ట్ మీటర్ల కంపెనీ ప్రారంభించడం, స్మార్ట్ మీటర్లు పెట్టాలని మోడీ ఆదేశించడం, జగన్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల టెండర్లు పిలవడం ఇవన్నీ అదాని కంపెనీకి ప్రజల సొమ్మును ధారాదత్తం చేసే కుట్రలో భాగమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుల కె శ్రీదేవి, సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి బి.రమణరావు , నాయకులు కే.దుర్గారావు ,టీ. ప్రవీణ్, ఝాన్సీ, సిహెచ్ శ్రీనివాస్, సుబ్బారావు, పీర్ సాహెబ్, షకీలా, ఆషా, గోవిందు, ప్రసన్న, కష్ణ, అజయ్, ఏం. బాబురావు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

పజాశక్తి - వన్‌టౌన్ : ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపటం సరికాదని సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు తెలిపారు. సిపిఎం పశ్చిమ నగర్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వన్‌టౌన్ సామారంగం చౌక్ సెంటర్ నుండి విద్యుత్ పోరుబాట ప్రచార కార్యక్రమం మెయిన్ బజార్లో కొనసాగింది. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ మోడీ బిజెపి, జగన్ వైసిపి జాయింట్ బాదుడు మొదలెట్టారని తెలిపారు. అదాని, జిందాల్ కంపెనీకి వరాలిస్తూ ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నారని వాపోయారు. విద్యుత్ సర్దుబాటు పేరుతో కొత్త దోపిడీ విధానానికి శ్రీకారం చుట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు అదుపు చేస్తామన్న బిజెపి, వైసిపి ప్రజలను ఘోరంగా మోసగించాయని మండిపడ్డారు. విద్యుత్ చార్జీల బిల్లులు చెల్లించేందుకు అప్పులు పాలై ఆస్తులు అమ్ముకునే పరిస్థితి నెలకొంటోందన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో అధిక మొత్తలను సమీక్షించి విద్యుత్ భారాలను రద్దు చేయాలని బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. ఈనెల 30వ తేదీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జరిగే ఆందోళనలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పశ్చిమ నగరం నాయకులు కే. సూరిబాబు ఈవీ నారాయణ, జి. వెంకట్రావు, సిహెచ్ దాసు, ధూళి రమణ, పూర్ణ, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.



వన్‌టౌన్‌లో...



వీరులపాడులో...

ప్రజాశక్తి-వీరులపాడు : మండలంలో జుజ్జూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ పెద్ద ఎత్తున ప్రజలు ప్రచారం నిర్వహించారు.సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోట కళ్యాణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ఛ్ర్జీ చాలు పెంచి ప్రజల్ని మరింత ఇబ్బందులు గురిచేస్తుందని తక్షణమే వ్యక్తి తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు వచ్చిన తర్వాత రెండేళ్లకు మూడేళ్లకు ఒకసారి కరెంట్ చార్జీలు పెంచడం అన్యాయం అన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజలపై భారాలమవుతుందని అన్నారు రానున్న ప్రజల ఐక్యం చేసి విద్యుత్ పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వీరులపాడు మండల కార్యదర్శి చాట్ల రవి, కమిటీ మండల సభ్యులు గుంజి వీరయ్య, లాల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



రీపోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్

ప్రజాశక్తి -నందిగామ/వత్సవాయి : దళిత బిడ్డ తుంగ ప్రవళిక మతదేహానికి రీ-పోస్టుమార్టం వెంటనే నిర్వహించాలనీ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు , న్యాయవాదులు కుటుంబ సభ్యులు మంగళవారం నందిగామ ఆర్డీవో రవీంద్రరావు కు వినతిపత్రం అందజేశారు. తుంగ ప్రవళిక మతి పట్ల సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి మతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, తక్షణమే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ , ఎస్పీ , ఏసీపి దళిత బిడ్డ మతురాలు తుంగ ప్రవళిక గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి అండగా ఉండాలని డిమాండ్ చేశారు. మహిళా కమిషన్ చైర్మన్ చనిపోయిన బాధిత కుటుంబన్ని పరామర్శించి అండగా ఉండాలని కోరారు. వత్సవాయి మండల తాసిల్దార్ తక్షణమే పరిశీలించి బాధిత కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ యంగ్రాతి కోటేశ్వరరావు మాదిగ , ఎంఎస్పి ఉమ్మడి కష్ణాల సమన్వయకర్త మంద వెంకటేశ్వరరావు మాదిగ, ఎమ్మెస్పీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ కోట దానియేలు మాదిగ , జగ్గయ్యపేట నియోజకవర్గ ఇంచార్జ్ మంద పిచ్చయ్య మాదిగ, న్యాయవాది అద్దంకి మణి బాబు తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు నగర పంచాయతీ పాలక వర్గ సభ్యుల్లో మరోసారి విభేదాలు తేటతెల్లం అయ్యాయి. కౌన్సిల్ సమావేశం కోరంలేక మరోసారి వాయిదా పడటమే అందుకు నిదర్శనం. చైర్ పర్సన్ గత్తం కస్తూరి భాయి అధ్యక్షత న మంగ ళవారం ఉదయం11 గంటల కు ప్రారంభంకావాల్సివుండగా అధికార పక్షానికి చెందిన 17 మంది కౌన్సిలర్లకు గాను చైర్ పర్సన్ తో కలిపి 9 మంది మాత్రమే హాజరవటం, ముగ్గురు ప్రతి పక్ష సభ్యులు సమావేశానికి రాకుండా బయట ఉండటంతో సమావే శానికి కావాల్సిన 11 మంది సభ్యులు లేనం దున కోరం లేక సమావేశం వాయిదా వేస్తున్నట్లు చైర్ పర్సన్ ప్రకటించారు.

తిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరపతమ్మ అమ్మ వారిని తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పార్ల మెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సతీమణి, వారి కుటుంబ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి మొక్కుబడులు తీర్చుకున్నారు వారికి ఆలయ చైర్మన్ చెన్నకేశవ రావు ఆలయ అర్చకులు పేద పండితులచే ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు.

విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎం జె పి ఏ పి సి వెల్ఫేర్ గురుకుల విద్యాలయం బాలుర పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కే రామ్మోహన్ రావు 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన బాణావత్ నవీన్ నాయక్ (544), గండేపల్లి దిలీప్ కుమార్ (528) చలమల మనోజ్ కుమార్ (527) లను శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో ఏటీపీ బాలశౌరి సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

నేడుఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

అంతర్జాతీ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం జగ్గయ్య పేట ఎల్ఐసి కార్యాలయంలో ఉదయం ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు జగ్గయ్యపేట ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ రామకష్ణ శాస్త్రి తెలిపారు. డాక్టర్ వి వెంకట్ ఎండి అండ్ డయాబెటాలజిస్ట్, స్మైల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ జగ్గయ్యపేట కార్యాలయానికి విచ్చేసి ఉచితంగా మెడికల్ చెక్అప్ చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ఆర్‌బికెను సందర్శించిన ఇథియోపియా బృందం



ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : రాష్ట్రంలోని వ్యవసాయ వ్యవస్థను రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ధరలను ఎలా అందజేస్తోందో అధ్యయనం చేయడానికి, ఇథియోపియా ప్రభుత్వ ప్రతినిధులు మంగళవారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని (ఆర్‌బికె) సందర్శించారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధి హిమేష్ పటేల్ ఆధ్వర్యంలో 8 మంది సభ్యుల బందం గొల్లపూడిలోని ఆర్‌బికెను సందర్శించింది. ఇందులో భాగంగా రైతులకు భూసార పరీక్షలు, వరి సేకరణ, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల సరఫరాపై బందం సభ్యులు ఆరా తీశారు. స్టడీ టూర్ యొక్క ప్రధాన ఉద్దేశ్యం రాష్ట్రం నుండి ఉత్తమ సాగు విధానాలను తమ దేశంలో అమలు చేయడానికి వాటిని తీసుకోవడమేనని బంద సభ్యులు తెలిపారు. వ్యవసాయంలో వెనుకబడి ఉన్న ఇథియోపియా, రాష్ట్రంలో అమలు చేస్తున్న వ్యవసాయ విధానాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను తమ దేశంలో అమలు చేసేందుకు ఆసక్తి కబనరిచారు. తొలుత ఈ బందం సభ్యులు గొల్లపూడి, రాయనపాడు, పైదురపాడు రైతులతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్తమ సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్ నాగ మణమ్మ, డిఆర్‌సి టి మాధవి లత తదితరులు వ్యవసాయంలో లాభదాయకమైన పద్ధతులను వివరించారు, అలాగే రాష్ట్రంలో అమలులో ఉన్న అనేక పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విజయవాడ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి వెంకటేశ్వరరావు, విజయవాడ రూరల్ వ్యవసాయ అధికారి బి రంగనాథ్ బాబు, ఉద్యానశాఖ సహాయ సంచాలకులు బాలాజీ పాల్గొన్నారు.

ఉచితంగా స్వయం సంరక్షణా పరికరాలు అందజేత

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణంలో బోదకాలు వ్యాధిగ్రస్తులు, కుష్టు రోగులకు ఉచి తంగా స్వయం సంరక్షణ పరికరాలు అందజేయనున్నట్లు లెప్ర సొసైటీ ఔట్ రీచ్ వర్కర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక 8వ వార్డు పరిధి లోని ఇందిరా కాలనీ, వడ్డెర బజారులో వైద్యారోగ్య సిబ్బందితో కలిసి ఇంటిం టికి తిరిగి లెప్రసి, ఫైలేరియ రోగుల గుర్తిపు సర్వే చేశారు. బోదకాలు, కుష్టు వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసి న జాగ్రత్తలు వివరించారు. యుపిహెచ్ సి వైద్యాధికారిణి ఎం.కపారాణి సమ న్వయంతో తిరువూరు పట్టణంలో 56 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించామ న్నారు. వచ్చే నెలలో స్వయం సంరక్షణ శిబిరాలు నిర్వహించి, రోగులకు అవస రమైన క్రేప్ బ్యాండేజెస్, ఈవా చెప్ప ల్స్, ఆయిట్మెంట్స్, లిక్విడ్స్ ఉచితంగా అందజేస్తామని చంద్ర శేఖర్ వెల్లడిం చారు. హెల్త్ సెక్రటరీ లు, ఆశ కార్యకర్త లు పాల్గొన్నారు.

తారకనాథ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - గంపలగూడెం : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది యూనియన్ అమరావతి సర్కిల్ మాజీ సెక్రెటరీ కామ్రేడ్ తారకనాథ్ 19వ వర్ధంతి మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక ఎస్బిఐ ముందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. స్టేట్ బ్యాంక్ సిబ్బంది యూనియన్ రీజినల్ సెక్రెటరీ ఎల్ హెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఖాతాదారులకు అల్పాహారంతో పాటు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ తోట బాబురావు, అకౌంటెంట్ సత్తి బుజ్జి ఖాతాదారులు, సిబ్బంది, పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ విజయవాడ మాడ్యూల్ డి జి ఎస్ భవాని శంకర్ నేతత్వంలో ఎస్బిఐ ఎస్యుఎసి సంఘ పూర్వ కార్యదర్శి అయిన కామ్రేడ్ వై. తారకనాథ్ వర్ధంతి జరిపారు. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం సహాయ మాత స్కూల్ మరియు కేతనకొండలోని అమ్మానాన్న వద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ ఇబ్రహీంపట్నం ఏడిపిఎల్ఎస్ వీరరావ్, కొండపల్లి ఎల్ ఎస్ శ్రీకాంత్, బి టి పి ఎస్ బ్రాంచ్ ఎల్ ఎస్ కుసుమ పాల్గొన్నారు

శివాలయం భూములకు వేలం పాటలు

ప్రజాశక్తి -నందిగామ : నందిగామలో శుఖశ్యామలాంబ సమేత రామలింగేశ్వర దేవస్థానానికి చెందిన పొలాలు 2 విడత ఆలయ అధికారులు వేలం పాట నిర్వహించారు. 160.72 సెంట్ల (మాగాణి) వేలంపాటలో 10 మంది రైతులు పాల్గొన్నారు . దేవాదాయ నిబంధన ప్రకారం 3 సం కౌలు 10 లక్షల 65 వేలు కౌలు ద్వారా ఆదాయం వచ్చినట్టు ఈవో పామర్తి సీతారామయ్య వెల్లడించారు. దేవాదాయ శాఖ నిర్ణయించిన మద్దతు ధర ఎకరకు 10 వేలు నిర్ణయం చేశారు. వేలంపాట పర్యవేక్షణ అధికారిగా వాసిరెడ్డి భూపాల్ పాల్గొన్నారు.

ఘనంగా కొల్లు రవీంద్ర పుట్టినరోజు వేడుకలు

పలుచోట్ల అన్న, వస్త్రదానం కార్యక్రమాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర పుట్టినరోజు వేడుకలు మంగళవారం మచిలీపట్నంలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు బందరు కోట రామాలయంలో పూజలతో మొదలైఅనంతరం 30 డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ, 32 డివిజన్ కాలేఖాన్ పేటలో నారగాని కృష్ణ ఆధ్వర్యంలో చింతగుంటపాళెం యానాదుల కాలనీలో చెప్పులు పంపిణీ, 34 డివిజన్ లో కాలేషా ఫిరోజ్ ఆధ్వర్యంలో చెంపాచెరువు ప్రభుత్వ స్కూల్‌లో కంబాక్స్, పరీక్షల ప్యాడ్‌ల పంపిణీ జరిగింది. 27 డివిజన్ రాళ్ళకొట్టు రాము ఆధ్వర్యంలో పేదలకు కరెంటు బిల్లుల చెల్లించారు. 25 డివిజన్‌లో బోడ్డుశ్రీను ఆధ్వర్యంలో జవ్వారుపేట సెంటర్‌లో క్రికెట్ కిట్లు, జ్యూస్ పంపిణీ చేశారు. పోలాటితిప్ప సర్పంచ్ మోకా రాజు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కేకే కటింగ్ చేసి వెయ్యి మందికి అన్నదానం చేశారు. 16 డివిజన్ కార్పోరేటర్ దింటకుర్తి సుధాకర్ ఆధ్వర్యంలో ఐదురోడ్ల సెంటర్‌లో మహిళలకు చీరలు పంపిణీచేశారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోనేరు సెంటర్‌లో వెయ్యి మొక్కల పంపిణీ చేశారు. తెలుగుమహిళ అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పళ్ళు, పంపిణీ చేశారు. ఒకటవ డివిజన్ లో ఐ.పి.సి కరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆనంద్ పేట చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. 38 డివిజన్ లో కార్పోరేటర్ అన్నం ఆనంద్, వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో, ముత్యంగుడి వద్ద, వడ్డే రంగారావు ఇంటి ఎదురుగా వృద్ధాశ్రమంలో అన్నదానం జరిగింది. 39 డివిజన్ లో కట్టా అంజిబాబు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఇంటివద్ద.40 డివిజన్ లో రాజులపాటి నాగబాబు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. 46/47 డివిజన్లలో ఆళ్ళమాధవ ఆధ్వర్యంలో ఈడేపల్లి వృద్ధాశ్రమంలో అన్నదానం జరిగింది. 5వ డివిజన్ రామగాని రత్నారావు ఆధ్వర్యంలో చిలకలపూడి సెంటర్‌లో అన్నదానం చేశారు. 15వ డివిజన్ హసీమ్ బేగ్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ పాలెం ఖలీమ్ బేగ్ ఇంటి వద్ద చీరలు పంపిణీ చేశారు. బాజాని ఆధ్వర్యంలో మల్కాపట్నం, జవ్వారుపేట మదర్సాల్లో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీమంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని కేక్ కట్ చేసి పేదలకు దుస్తులు, చెప్పులు, చీరలు పంచారు. అనంతరం పేదలకు అన్న దానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రమణ్యం, మాది రెడ్డి శ్రీను, మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన టిడిపి నాయకులు, మత్స్య కార నాయకులు, రవీంద్ర అభిమానులు పాల్గొన్నారు.


మహిళలకు చీరలు పంపిణీచేస్తున్న కొల్లు రవీంద్ర

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ (నాగాయలంక)

నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే రాష్ట్రప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాగాయలంక మండలం పరచివర గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి గాను మాట్లాడారు. ఈ నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో జరిగిన సంక్షేమాన్ని వివరించారు. లిఈ కార్యక్రమంలో వైసిపి కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌ఛార్జి కడవకొల్లు నరసింహారావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



జెంగా అనిత బాధ్యతలు స్వీకారం

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి గ్రామ పంచాయతీ నూతన జూనియర్ అసిస్టెంటుగా అనిత బాధ్యతలు చేపట్టారు. లక్ష్మీపురం గ్రామ పంచాయతీ నుంచి అనిత చల్లపల్లి పంచాయతీకి బదిలీ అయ్యారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఇఒ పేర్ని మాధవేంద్రరావుల సమక్షంలో బాధ్యతలు చేపట్టిన ఆమెకు అభినందనలు తెలిపారు



సిసిఆర్‌సి కార్డులతో కౌలురైతులకు ఎంతోమేలు

పమిడిముక్కల మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పమిడిముక్కల

కౌలు రైతులకు పెద్దఎత్తున కౌలు కార్డులు జారీ చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేషన్ రైట్స్ కార్డ్స్) మేళాలు నిర్వహిస్తోందని పమిడిముక్కల మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్‌రెడ్డి అన్నారు. పమిడిముక్కల మండలంలోని తాడంకి సచివాలయం వద్ద కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మంగళవారం ఆయన పంపిణీచేశారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో గణేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆర్బీకే స్థాయిలో మేళాలు నిర్వహించేలా వ్యవసాయ, రెవెన్యూ శాఖలు చర్యలు చేపట్టాయన్నారు. కౌలు రైతులకు నూరు శాతం పంట రుణాలు ఇవ్వాలన్న సంకల్పంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్‌ల)ను ప్రభుత్వం ఇప్పటికే ఆర్బీకేలతో అనుసంధానించిందన్నారు. ప్రతి కౌలు రైతుకు రుణంతోపాటు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలన్న భావనతో కౌలుదారులందరికీ పంట సాగు హక్కు పత్రాలు (కౌలు కార్డులు) జారీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులను జారీ చేసే ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారుల వివరాలను రైతు భరోసా పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో వైఎస్సార్ రైతు భరోసా కింద ఈ ఏడాది తొలివిడత సాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో కౌలుదారులకు మేలు చేయాలన్న సంకల్పంతో 2019లో తెచ్చిన పంట సాగుదారుల హక్కు పత్రాల (సీసీఆర్‌సీ) చట్టంతో 11 నెలల కాల పరిమితితో ప్రభుత్వమే కౌలు కార్డులు జారీ చేస్తోందన్నారు. వీటిద్వారా కౌలు రైతులకు నాలుగేళ్లుగా పంట రుణాలతో పాటు వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీ, పంటల బీమా, పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) వంటి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. కౌలు రైతులు తాము పండించిన పంటలను ఈ క్రాప్ ఆధారంగా ఆర్బీకేల ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. పమిడిముక్కల మండలంలో మొత్తం 2422 మందికి కౌలు గుర్తింపుకార్డులు అందజేస్తామన్నారు. తాడంకి గ్రామ సర్పంచ్ జంపాన ధనలక్ష్మి కౌలురైతులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ వాసు, వ్యవసాయ సహాయకురాలు కావ్య, ఎంపిటిసి కూచిపూడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కౌలుకార్డులను అందజేస్తున్న గణేష్‌రెడ్డి, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి

నారా భువనేశ్వరి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-చల్లపల్లి

ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్మన్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పుట్టినరోజు వేడుకలు చల్లపల్లి మండలం పరిధిలోని పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. పిల్లల సమక్షంలో కేక్ కట్ చేశారు. నారా లోకేష్ సేవాసమితి అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాసరావు వితరణతో ఎన్టీఆర్ స్కూల్లో పనిచేసే మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, మాజీ డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, మాజీ సొసైటీ ఛైర్మన్ నాదెళ్ల వెంకట నరసయ్య, తాతా ప్రదీప్, ప్రిన్సిపాల్ మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు అందజేస్తున్న ప్రతినిధులు

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం

చోరగుడి గ్రామ సర్పంచ్ కందిమళ్ల పూర్ణ కుమారి

ప్రజాశక్తి-పమిడిముక్కల

సమీకృత శిశు అభివృద్ధి సేవల పథకం (ఐసిడిఎస్) ద్వారా నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు మంచి చదువుతోపాటు పౌష్టికాహారం అందుతోందని చోరగుడి గ్రామ సర్పంచ్ కందిమళ్ల పూర్ణ కుమారి అన్నారు. పమిడిముక్కల మండల పరిధిలోని చోరగుడి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో జన భగీరధి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణకుమారి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు దాటే వరకు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని తల్లులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పిల్లల ఆరోగ్యం పై శ్రద్ధ వహిస్తున్నట్లు వివరించారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని తల్లులను కోరారు. పిల్లలకు ఆరేళ్ల వయస్సు వరకూ చాలా చక్కగా చూసుకోవాలన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ ఐసిడిఎస్ ద్వారా అంగన్వాడీ పిల్లలకు ప్రాథమిక స్థాయిలో మంచి విద్యాబోధన అందుతుందన్నారు. పిల్లలకు మంచి పౌష్టికాహారాన్ని అందించటం ద్వారా వారు ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సుబ్రహ్మణ్యం, టిడిపి సీనియర్ నాయకుడు కందిమళ్ల సుబ్రహ్మణ్యం, అంగన్వాడీ సిబ్బంది, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



పిల్లలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న కందిమళ్ల పూర్ణకుమారి, ఝాన్సీరాణి

72వ రోజు మజ్జిగ పంపిణీ

చల్లపల్లి: స్వచ్ఛ చల్లపల్లి, యార్లగడ్డ శివరామ ప్రసాద్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గంగులవారి పాలెం రోడ్డులోని గస్తీ గది వద్ద ప్రారంభించిన మజ్జిగ పంపిణీ మంగళవారం 72వ రోజుకు చేరింది. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ (రాజా) పుట్టినరోజు సందర్భంగా మేనకోడళ్లు అక్షర, అద్విక, అన్విక, అవ్యక్త్‌లు సహకారం అందించారు. స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి శాస్త్రి,బీడీఆర్ పర్యవేక్షణలో స్వచ్ఛ కార్యకర్తలు, పూర్వ విద్యార్థులు డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, దేశుమాధురి, మెండు శ్రీను, రాయపాటి రాధాకృష్ణ, రాయపాటి విజయ రమ, ఘంటా లీలాకృష్ణ, విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు తదితరులు పాల్గొని సేవలు అందించారు.


మజ్జిగ పంపిణీచేస్తున్న ప్రతినిధులు

23న కేంద్రమంత్రి భారతీప్రవీణ్‌పవార్ రాక

గుడివాడ : కేంద్ర మంత్రి డాక్టర్ భారతీప్రవీణ్‌పవార్ కృష్ణాజిల్లాలో ఈ నెల 23న పర్యటించనున్నారనిబిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు తెలిపారు. మంగళవారం బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేరోజు మెవ్వ, మోపిదేవి ఆలయాల్లో పూజల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 22న మచిలీపట్నంలో రాత్రికి వచ్చి బస చేస్తారన్నారు. 23న అవనిగడ్డలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు.

కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల ఇళ్లల్లో సోదాలు

విలువైన ఆస్తులు, డాక్యుమెంట్లు స్వాధీనం



ప్రజాశక్తి-విజయవాడ: కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అవకతవకలకు పాల్పడి అరెస్ట్ అయిన వారితో పాటు పరారిలో వున్న ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ళల్లో ఏక కాలంలో సోదాలు నిర్వహించినట్లు నగర పోలీసు కమిషనర్ కాంతిరాణా టాటా తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...పోలీసు అధికారులు నిర్వహించిన సోదాల్లో స్వాధీనం చేసుకున్న సొత్తును బుధవారం కోర్టులో ఇవ్వడం జరుగుతుందన్నారు. విజయవాడ పటమటలోని డివిజన్ కమర్షియల్ టాక్స్ కార్యాలయ డిప్యూటి కమీషనర్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఈ విచారణ జరిగిందన్నారు. గత నెల 30న తమ డివిజన్‌లోని ఇంటిలిజెన్స్ విభాగంలోని కొంత మంది ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే విధంగా డీలర్లు , వ్యాపారస్తులతో కుమ్మక్కై, భారీ మొత్తంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని డిప్యూటీ కమిషనర్ తెలిపారన్నారు. తప్పుడు రికార్డులను సష్టించి, పంపిణీ రిజిస్టర్లలోని ఫైళ్ళను మాయం చేసి , విధిని ఉల్లంఘిస్తూ వారి స్వలాభం కోసం, ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించారని సంబంధిత అధికారులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా...పటమట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయిందన్నారు. ఏ.సి.పి. స్థాయి అధికారులతో కూడిన ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించామన్నారు. విజయవాడ కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో పనిచేస్తున్న జి.ఎస్.టి.ఆధికారి బి. మెహర్ కుమార్, గుడివాడ కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో పనిచేస్తున్న జి.ఎస్.టి.ఆధికారి కె.సంధ్య, చీఫ్ కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.వి.చలపతి, విజయవాడ కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేంట్ ఎం.సత్యనారాయణ. చీఫ్ కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరినేడేంట్ కె.రామసూర్యనారాయణలను నిందితులుగా గుర్తించారు. సమగ్ర విచారణలో బాగంగా ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన అనంతరం వారు చేసిన అవకతవకలపైనే గాక, వారు కలిగి వున్న అక్రమ ఆస్తులపై పూర్తి స్థాయి సమాచారం సేకరించడానికి ఏ.సి.బి.కోర్ట్ నుండి ముందస్తు అనుమతులను పొంది సెంట్రల్ ఏ.సి.పి. పి.బాస్కర రావు నేతత్వంలో ఆరు ప్రత్యేక బందాలుగా ఏర్పడి ముద్దాయిల ఇళ్ళపై ఏక కాలంలో పోలీస్ బందాలు సోదాలను నిర్వహించడం జరిగింది. సోదాల్లో ముద్దాయిలు అక్రమ సంపాదన తో కూడబెట్టిన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదు, బంగారు, వెండి ఆభరణాలు విలువైన సమాచారం నిక్షిప్తమై వున్న ముద్దాయిలకు చెందిన లాప్ టాప్ లు, సెల్ ఫోన్లు, కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో కనిపించకుండా పోయిన ఫైల్స్ వివరాలు సేకరించారు. మరిన్ని విలువైన ఆస్తి పత్రాల కోసం, కేసుకు సంబంధించిన ఫైళ్ల కోసం సోదాలు కొనసాగుతున్నాయి. సోదాల్లో స్వాధీనం చేసుకున్న సొత్తును బుధవారం కోర్ట్‌లో ఇవ్వడం జరుగుతుందని నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా తెలిపారు.

జీతాల కోసం ఎదురుచూపులు

10 మాసాలుగా అటవీ శాఖ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆర్థిక ఇబ్బందులు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

అటవీ శాఖ పరిధిలోని అవుట్‌సోర్సింగ్ సిబ్బందిపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి భద్రతా, భరోసా లేక పోవడంతో వీరి జీవితాలు గాలిలో దీపంలా మారాయి. పూర్తి స్థాయిలో శాఖలో విధులు నిర్వహిస్తున్నా వేతనాలు అందడం లేదు. సకాలంలో వీరికి వేతనాలు చెల్లించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం అలాంటి చర్యలేమీ తీసుకోవడం లేదు. ఒకటి కాదు రెండు కాదు దాదాపు 10 మాసాల నుంచి ఇదే దుస్థితి. దీంతో వారి కుటుంబాలు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఈ పరిస్థితులు దాపురించాయి. ఎన్టీఆర్ జిల్లా అటవీ శాఖ విజయవాడ డివిజన్ పరిధిలో సుమారు 20 మంది వరకు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. స్ట్రైకింగ్ ఫోర్సుగాను, చెక్ పోస్టుల్లో హెల్పర్స్ గాను, వాహనాల డ్రైవర్ల గాను వీరు విధులు నిర్వహిస్తున్నారు. శాఖాపరమైన విధుల నిర్వహణలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు. అధికారులు అటవీ ప్రాంతాల్లో చేపట్టే చెకింగ్‌లతో పాటు రహదారులపైన చెక్ పోస్టుల వద్ద చేపట్టే తనిఖీల్లో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు. దొంగలు, అక్రమార్కులు అటవీ సంపదను తరలించే సమయాల్లో ప్రాణాలకు తెగించి అడ్డుకుంటున్నారు. ఇబ్రహీంపట్నం, మైలవరం, తిరువూరు, నందిగామ, కృష్ణా నది వారధి చెక్‌పోస్టుల్లో వీరు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ. 12వేల నుంచి రూ. 14వేల వరకు గతంలో చెల్లించే వారు. పిఎఫ్‌తో పాటు ఇతర కటింగ్‌లు పోను రూ. 8వేల నుంచి రూ. 10వేల వరకు చేతికి అందుతాయి. దీనిలోనే ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, కుటుంబ పోషణ చూసుకోవాల్సివుంది. ఇక కుటుంబ సభ్యులకు ఏదైన అనారోగ్య సమస్యలు తలెత్తితే అప్పు చేయాల్సిందే. ముందుగానే అంతంత మాత్రం వేతనాలు కలిగిని వీరికి దాదాపు 2022 ఆగస్టు మాసం నుంచి చెల్లింపులు నిలచి పోయాయి. దీంతో వీరి కష్టాలు మొదటికి వచ్చాయి. వీరిలో కొంత మంది 15, మరి కొంత మంది 20 ఏళ్లుగా ఇదే శాఖలో పని చేస్తున్నారు. మరో వైపు వీరు లేక పోతే కీలకమైన తనిఖీలు వంటి పనులు ఆగి పోయే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారి కుటుంబ కష్టాలను చూసి అధికారులే ఆదుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి వారు పని చేస్తుండటంతో అప్పులు చేసి వారి కుటుంబాలను ఆదుకుంటున్నారు. అయితే రాను రాను ఇది కూడా కష్టంగా మారుతోందని ఒక సీనియర్ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. ఏదో ఒక రోజు ప్రభుత్వమే వేతన బకాయిలను చెల్లిస్తుందనే కొండంత ఆశతో వారు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

జైలుకెళ్లడానికైనా సిద్ధం

పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే ఈ వంతెనే గత్యంతరమన్నారు. ఇంతటి ప్రాధాన్యత గల ఈ బ్రిడ్జిని గాలికి వదిలేయడం పట్ల మధు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్నావా? లేదా పరిపాలన చేస్తున్నావా? అని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధిని ఉద్దేశించి ప్రశ్నించారు. గత నాలుగేళ్లుగా నువ్వు చేస్తున్నది ఏంటని నిలదీశారు. నిధులు మంజూరయ్యాయనీ, టెండర్లు పిలుస్తామనీ, తామే బ్రిడ్జి నిర్మాణం చేస్తామనీ, ప్రారంభిస్తామని అనేకసార్లు రక్షణనిధి ప్రకటించారని గుర్తుచేశారు. నియోజకవర్గ ప్రజలను రక్షణ నిధి మోసం చేస్తున్నారని విమర్శించారు. వంతెన నిర్మాణ సమస్యపై చర్చించేందుకు త్వరలో అఖిలపక్ష ప్రజాసంఘాలతో సమావేశమవుతామన్నారు. అనంతరం రాస్తారోకోలు, బంద్‌లతోపాటుగా అనేక రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకూ తమ పార్టీ ప్రజాసంఘాల నాయకులను కలుపుకొని వంతెన సాధన కోసం నిరంతర పోరాటం చేస్తామన్నారు.

వంతెనను పరిశీలించిన పాదయాత్ర బందం

మంగళవారం పాదయాత్రలో భాగంగా ధ్వంసమైన గంపలగూడెం కట్టలేరును మధుతో పాటు పాదయాత్ర బృందం పరిశీలించింది. ఈ వంతెన నిర్మాణం చేపట్టకపోతే అనేక గ్రామాల ప్రజల జీవన విధానం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కళ్ళు తెరిచి ప్రజల అవసరాల నేర్పి ఈ బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని పాదయాత్ర బృందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కనుమూరులో ప్రారంభమై అనుములంక, వినగడప తోటమూల గంపలగూడెం గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ధ్వంసమైన కట్టలేరు పై అవగాహన కల్పించారు. పలు కూడళ్లలో ప్రజలను చైతన్యవంతం చేసి, బ్రిడ్జి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, గంపలగూడెం మండల కార్యదర్శి గువ్వల సీతారామిరెడ్డి, తిరువూరు మండల రూరల్ కార్యదర్శి సాంబార్ వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల నాయకులు, రైతులు, స్థానిక మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలు బ్రహ్మరథం

కట్టలేరు వంతెన నిర్మాణం చేయాలంటూ మంగళవారం చేసిన పాదయాత్రకు గ్రామ గ్రామాన ప్రజలు బ్రహ్మరథం పట్టారు ప్రతి గ్రామంలోనూ మజ్జిగ, మంచినీళ్లు, అల్పాహారం అందించడం పట్ల మధు కృతజ్ఞతలు తెలిపారు. ముందుటెండను సైతం లెక్కచేయకుండా దాదాపు 20 కిలోమీటర్ల ప్రయాణం చేయడం విశేషం.

తహశీల్దార్‌కు వినతి

కట్టలేరు వెంటనే నిర్మించాలనీ డిమాండ్ చేస్తూ, మంగళవారం మండల సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ముగిసిన అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు.

లంకా కాళిదాసుకు కన్నీటి వీడ్కోలు

చదువుతూ ఉండేవారని జీవితాంతం కమ్యూనిస్టుగానే ఉన్నారన్నారు. సిపిఎం తూర్పుకృష్ణాజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ రఘు మాట్లాడుతూ కాళిదాసుతో కలిసి 15 నుంచి 20 సంవత్సరాలు ఉద్యమంలో కలిసి పనిచేశామన్నారు. వృద్ధాప్యంలో ఉన్నా, ప్రజా ఉద్యమాలను నిర్మించటం ద్వారా ఏదోరకంగా ఇంకా పార్టీని అభివద్ధి చేయాలనే ఆలోచనతో ఎల్లప్పుడూ ఉండేవారని గుర్తుచేశారు. కొత్తతరాలకు కమ్యూనిస్టు విలువలను తెలియజేయాలని నిరంతరం పార్టీ కోసం పాటుపడ్డారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ కాళిదాసు తన జీవితాన్ని ఆదర్శ కమ్యూనిస్టుగా గడిపారని గుర్తుచేశారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై జరిగిన పోరాటాల్లో ముందుడి నడిపించారని గుర్తుచేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి మురాల రాజేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి గూడపాటి ప్రకాష్, ఎంసిపిఐ నాయకురాలు భానుమతి, సిపిఎం చల్లపల్లి మండల కార్యదర్శి వై.మధు, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, ఐద్వా నాయకురాలు విజయ, సాగిరాజు ఉదయభాస్కర్ రాజు, ఉమాశంకర్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు రమేష్ చౌదరి, వైసిపి నాయకులు పాలేటి చంటి, సిపిఎం నాయకులు ఆర్ సి పి రెడ్డి, టి.లక్ష్మణరావు, బి వి శ్రీనివాస్, పిడుగు దేవ సహాయం, శివ, కొండ, వెంకట్రావు, వై.కోటేశ్వరరావు, బివి అరుణ, పల్లపు ప్రభుదాస్, పల్లపు వీరమ్మ, పి.రజిని, శంకరంపాడు సర్పంచ్ కైలే సుబ్బారావు తదితరులు పాల్గొని కాళిదాసు పార్థివ దేహానికి నివాళులర్పించారు.

అత్యాచార నిందితుడిని శిక్షించాలి

ఆశ్రమాన్ని మూసివేయించాలని డిమాండ్ చేశారు. తక్షణం బాధిత బాలికను అన్ని రకాలుగా ఆదుకోవడంతో పాటు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.ఝాన్సీరాణి, స్వప్న, ఆషా తదితరులు పాల్గొన్నారు.

పలకరించిన తొలకరి

ప్రారంభమైంది. మంగళవారం ఏపీలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించాయి. దీని ప్రభావంతో ఏపీలోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షం పడింది. మంగళవారం సాయంత్రం విజయవాడలో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. గత రెండు వారాలుగా నగరంలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎండ తీవ్రతకి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. మంగళవారం కురిసిన వర్షంతో విజయవాడ ప్రజలు సేదతీరారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని నందిగామ, విజయవాడ, తిరువూరు, మైలవరం, కృష్ణాజిల్లాలోని గన్నవరం, ఉయ్యూరు, పామర్రు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

వైసిపి విజయానికి కలిసికట్టుగా పని చేయాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అందరం కలిసికట్టుగా పని చేస్తే మళ్లీ ఘన విజయం సాధిస్తామని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. సోమవారం రాత్రి జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో రాజగోపాల స్వామి వారి కళ్యాణ మండపంలో జరిగిన వైసిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొద్ది మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, వాటికి ఈ రోజు నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గడిచిన నాలుగేళ్ల హయాంలో కుల, మత, ప్రాంత, పార్టీ బేధాలు లేకుండా అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తూ అందరికీ అన్ని సంక్షేమ పథకాలు అందేలా చేశామన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు.

ఎంపి కేశినేనికి వినతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో పలు వార్డులలో ప్రజలు మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, శుభకార్యములుకు కూడా మంచినీటి సౌకర్యం లేక ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతున్నారనీ జగ్గయ్యపేట పట్టణ ప్రజల త్రాగునీరు అందించుట కొరకు 5 మంచినీటి వాటర్ ట్యాంకులు మరియు సబ్సిడీతో కూడిన 2 ట్రాక్టర్లు మంజూరు చేయాలని, పట్టణంలో 14 వ వార్డు విలియంపేట నందు రోడ్లు, సైడ్ డ్రైన నిర్మాణం కొరకు 20 లక్షలు, పట్టణంలో 25 వ వార్డులో క్రిస్టియన్ పేట బరియల్ గ్రౌండ్ కు ప్రహరీ గోడ నిర్మాణం కొరకు 20 లక్షలు మంజూరు కొరకు మంగళవారం మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ఆధ్వర్యంలో విజయవాడ ఎంపీ కేశినేని నానికి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం సాయి ప్రసాద్, మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకష్ణ, గుత్తా సురేష్, వార్డు కౌన్సిలర్లు సామినేని మనోహర్, కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వర రావు, సూర్యదేవర రాంప్రసాద్, వేదులపురి సైద, నకిరకంటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లు అరెస్ట్

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

కరుడు గట్టిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను కృష్ణాజిల్లా పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా గంజాయి, మాదకద్రవ్యాల నేరస్తులపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్న నేపథ్యంలో ప్రజారోగ్యాలతో చెలగాటమాడితే సహించేది లేదని జిల్లా ఎస్పీ పి జాషువా హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకోకుంటే పిడి యాక్ట్ తో చెక్ తప్పదని స్పష్టం చేశారు. స్థానిక ఆర్.పేట సర్కిల్ పరిధిలో గల బందరు తాలూకా పోలీస్ స్టేషనులో నమోదైన కేసులో అంతర్రాష్ట్ర నేరస్తుడు, గుడివాడ పట్టణంలో కాలేజీ యువతకు గంజాయి విక్రయిస్తున్న కేసులో ఒక స్మగ్లర్, ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఎస్పీ పాత్రికేయుల సమావేశం నిర్వహించి స్మగ్లర్ల వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, పూణే రాష్ట్రాల్లో ఉన్న 64 మంది గంజాయి స్మగ్లర్లకు గంజాయిని రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న చత్వా గ్రామం, పాడువ మండలం కోరాపుట్ జిల్లా, ఒరిస్సాకు చెందిన కొర రాందాస్ అలియాస్ బట్టు బాయ్ (33)ను ఆర్.పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి, ఎస్ఐ వాసు, సిబ్బందితో వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో ఆర్ఎస్ 5 కెటిఎమ్ బైక్లో గంజాయిని గుర్తించారన్నారు. అదుపులోనికి తీసుకొని విచారించగా, అతను బందర్ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులోని నలుగురు ముద్దాయిలలో ప్రధాన నిందితుడని నిర్ధారణకు వచ్చారన్నారు. ఒక బైక్, 5 కిలోల గంజాయిని జప్తు చేశామన్నారు. విచారణలో నేరస్థుడు చత్వా కేంద్రంగా శీలావతి గంజాయి జాతులను దేశవ్యాప్తంగా స్మగ్లర్లకు రవాణా చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. బందరు తాలూకా, గుడివాడ టుటౌన్, ఘంటసాల, పెనమలూరు పోలీస్ స్టేషన్లలోని కేసుల్లో ప్రధాన నిందితుడుగా ఉన్నాడని తెలిపారు. చల్లపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి బి రవి కుమార్ ఆధ్వర్యంలో ఘంటశాల ఎస్ఐ కె.శ్రీనివాసు, సిబ్బంది పమిడిముక్కల మండలం, అప్పారావు పేట గ్రామానికి చెందిన చీకుర్తి నాని ఏ బీస్ట్, మోపిదేవి మండలం మోపిదేవి శివారు బోడగుంట గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ రాంకీలను గుర్తించి అవనిగడ్డ-విజయవాడ కృష్ణా కరకట్ట రోడ్డులో అదుపులోకి తీసుకున్నామన్నారు. సుమారు 1.2 కిలోల గంజాయి, రూ 500, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గుడివాడలో విద్యాసంస్థలను టార్గెట్గా చేసుకొని గంజాయి విక్రయాలు జరుపుతున్న ఎరేకేపాడుకు చెందిన మంచాల కిరణ్ రాజు (34) అదుపులోనికి తీసుకొని విచారించగా అరకులో నేరస్తుడు అయిన కొర్ర రాందాస్ వద్ద ఐదు కిలోల గంజాయి కొనుగోలు చేసినట్లు నేరం అంగీకరించాడు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పిల్లల నడవడిక యెడల అవగాహన కలిగి ఉండాలని, అలవాట్లు వ్యవహారశైలిపై ఎప్పటికపుడు నిఘా ఉంచాలని సూచించారు. చల్లపల్లి పరిసర ప్రాంతంలో గంజాయి అమ్ముతూ యువతను పక్క దారి పట్టిస్తున్నట్లు దృష్టికి వస్తే చట్టపరంగా కేసు నమోదు చేస్తామన్నారు. సస్పెక్ట్ షీట్స్ కూడా ఓపెన్ చెయ్యటం జరుగుతోందన్నారు. జిల్లాలో గంజా రవాణా, అమ్మకంపై గట్టి నిఘా ఏర్పాటు చేసి నలుగురు గంజాస్మగ్లర్లపై పిడి యాక్టు ప్రయోగించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపామన్నారు. గత 3 నెలల కాలంలో 120 మంది గంజా స్మగ్లర్లను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశామన్నారు. గంజాయి స్మగ్లర్లను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గంజా ఉనికిపై జిల్లా ఎస్పి 9440796400, జిల్లా ఏఎస్పి 944796401 లకు సమాచారం అందించాలని కోరారు.



మండలి వెంకట్రామ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి–అవనిగడ్డ

తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ పుట్టినరోజు వేడుకలు అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్ను ఆయన కట్ చేశారు. అవనిగడ్డ ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. నిరుపేదలకు వస్త్ర, అన్నదానం చేశారు. అభిమానులు గజమాలవేసి శుభాకాంక్షలు తెలిపారు. తాతయ్య మండలి వెంకటకృష్ణారావు, తండ్రి మండలి బుద్ధ ప్రసాద్ వారసత్వంలో వారిని మించిన నాయకుడిగా ఎదగాలని ప్రజల మనసులో సుస్థిర స్థానం సంపాదించాలని ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ, కోడూరు, మోపిదేవి మండల పార్టీల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, బండే శ్రీనివాసరావు, నడకుదుటి జనార్ధనరావు, మోపిదేవి మాజీ ఎంపీపీ మోర్ల విజయలక్ష్మి, చల్లపల్లి మండల పార్టీ అధ్యక్షులు మోర్ల రాంబాబు, సీనియర్ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు బండే నాగ వెంకట కనకదుర్గ, విశ్వనాథపల్లి పాప, చల్లపల్లి మాజీ ఎంపీపీ లంక బాబు, మత్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మండలి వెంకట్రామ్

త్వరలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం : కలెక్టర్

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో త్వరలో 10 బెడ్లతో కూడిన డయాలసిస్ సెంటర్ ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజాబాబు తెలిపారు. మంగళవారం ఆయన నాగాయలంక, అవనిగడ్డ మండలాల్లోని వైద్యశాలలను ఎమ్మెల్యే రమేష్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అవనిగడ్డ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ను కూడా ఆయన పరిశీలించి అపోలో వారి ఆధ్వర్యంలో ఏపీఎస్ ఎంఐడిసి ఇంజనీరింగ్ విభాగం సహకారంతో ఈ ప్రాంతంలో డయాలసిస్ సెంటర్కు అనువుగా ఉంటుందా లేదా అని భవనాలను పరిశీలించామన్నారు. భవనాలు డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు అనుకూలంగా ఉండటంతో తొలుత పది బెడ్లతో డయాలసిస్ సెంటర్ను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. డంపింగ్ యార్డ్ ను ఇక్కడ నుండి తరలించేందుకు వేరే చోట స్థలం అన్వేషిస్తున్నామన్నారు. త్వరలోనే డంపింగ్ యార్డ్ ని కూడా తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ ఓ గీతా బాయి, బి సి హెచ్ ఎస్ ఇందిరా దేవి, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జై కుమార్, డాక్టర్ నాగలక్ష్మి, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రాజబాబు, సింహాద్రి రమేష్బాబు

క్రీడా పాఠశాలలో సీట్ల భర్తీకి ఎంపికలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

కడపలోని వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు మండల స్థాయి ఎంపికలు బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎంఇఒ ఎన్.శివశంకరరావు, మండల స్పోర్ట్స్ అధికారి జివిఎన్ బి గోపాల్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుండి ఎంపికలు నిర్వహించనున్నామని తెలిపారు. నాలుగు ఐదు తరగతులలో ప్రవేశాలకు ఈ ఎంపికలు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డు, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ తో పాటు ఉదయం 8 గంటలకే రావాలని కోరారు.

పనితీరు పెంచుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు, ప్రజల్లో సంతృప్తిస్థాయి పెంపొందించి ప్రభుత్వం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడే లక్ష్యంతో జగనన్న సురక్ష పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతోందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, గృహ నిర్మాణం, ఖరీఫ్ ప్రణాళిక అమలు తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి ఈనెల 23న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారన్నారు. ఈ కార్యక్రమం కింద వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారు పొందుతున్న పథకాలు వివరాలు తెలుసుకోవడం, అర్హత కలిగి ఏవైనా పథకాలు అందకపోతే, వాటి కారణాలు, వారి సమస్యలు గుర్తించి, ప్రతి సచివాలయ పరిధిలో క్యాంపులు నిర్వహించి లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాలు అందించడం ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు పొందుటకు అవసరమైన మొబైల్ నెంబరు ఆధార అనుసంధానం ప్రతి ఒక్కరు చేసుకునేలా చూడాలన్నారు. జిల్లాలో ఆర్బికే వారి ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు రైతులకు అవసరమైన విత్త నాలు, ఎరువులు, పురుగుమందులు ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, కె ఆర్ సి సి డిప్యూటీ కలెక్టర్ బి శివ నారాయణ రెడ్డి, డిపిఒ నాగేశ్వర నాయక్, డి ఎల్ డిఒ సుబ్బారావు, డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్, తదితరులు కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థులకు సత్కారం

అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనపరిచి ఉత్తమ మార్కులు సాధించిన పేరు బోయిన హరిత నియోజకవర్గం స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఆమెకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అభినందనలు తెలిపారు. రూ.15 వేలు నగదు బహుమతిని అందజేశారు. బైపీసీ విద్యార్థిని కె.మౌనిక లక్ష్మి 963 మార్కులు సాధించి ఉభయ కృష్ణా జిల్లాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ స్థానం సాధించడంతో ఇటీవల మచిలీపట్నంలో జరిగిన ఆణిముత్యాల కార్యక్రమంలో జిల్లా మంత్రి జోగి రమేష్ చేతులు మీదుగా రూ.50 వేల నగదు బహుమతిని అందుకున్నారని తెలిపారు. వారి ప్రతిభ ద్వారా పుట్టిన ఊరికి తల్లిదండ్రులకు చదివిన కళాశాలకు ఆణిముత్యాలుగా పేరు ప్రఖ్యాతలు గడిచినందుకు వారిని కళాశాల ప్రిన్సిపాల్ జి.దుర్గా రమేష్తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు

గోరుముద్దను నాణ్యతగా ఇవ్వాలి

పెడన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించాలని పెడన పట్టణ సచివాలయాల కన్వీనర్ మతిన్ ఖాన్ పేర్కొన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు పెడన పట్టణంలోని బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ను మంగళవారం సచివాలయ కన్వీనర్ మతీన్ ఖాన్ సందర్శించారు. ఈ సందర్భంగా హైస్కూల్లో జగనన్న గోరుముద్ద పథకం నిర్వహణ గురించి ఆయన ఆరా తీశారు. హైస్కూల్ హెచ్ఎం ఉష, పేరెంట్స్ కమిటీ చైర్మన్ భాషా, సిఆర్పి నాగేశ్వరరావు లతో కలిసి విద్యార్థులకు అందించేందుకు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ టీవీల నిర్మాణ పనులను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

23న డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ఏపీఎస్ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని విద్యార్థులు ఉచిత, రాయితీపాసులు, వికలాంగులు(పీహెచ్ సి) ఇచ్చే రాయితీ పాసలపై వారి సందేహాలకు వివరణ ఇస్తామని వివరించారు. విద్యార్థులు తమ ప్రయాణ అవసరాలపై సలహాలు, సూచనలు ఫోన్ ద్వారా ఇవ్వాల్సిందిగా కోరారు. సెల్ : 99 5922 54 66 కాల్ చేయాలని డిఎం కోరారు.

పవర్ లిఫ్టింగ్లో రాష్ట్రస్థాయి విజేతలుగా స్టేడియం క్రీడాకారులు

గుడివాడ : ఇటీవల గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన 10వ రాష్ట్రస్థాయి క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో స్టేడియం జిమ్కు చెందిన ఇద్దరు మహిళా పవర్ లిఫ్టర్లు పాల్గొని విజయం సాధించడం అభినందనీయమని ఎన్టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్టిఆర్ స్టేడియంలో 47 కేజీల శరీర బరువు విభాగంలో 172,5 కేజీల బరువునెత్తి ఎన్.వీరనాగఅను బంగారు పతకం, 73కేజీల విభాగంలో కొండపల్లి మాణిక్యాలరావు 265 కేజీల బరువునెత్తి కాంస్య పతకం, ఎన్.వీరనాగఅను వెండి పతకం, గుదే సుభాషిణి వెండి పతకం, గుదే సుభాషీణి కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బొగ్గవరపు తిరపతయ్య, కోచ్ మారెళ్ళ వెంకటేశ్వరరావు, మేనేజర్ సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 21న 6గంటలకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎన్టిఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కమిటి ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ తెలిపారు. పట్టణంలోని స్వంచ్ఛంద సేవా సంస్థలు, కీడ్రాకారులు, ఉపాధ్యాయులు కళాశాల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సభ్యులు బొగ్గవరపు తిరపతయ్య, కోచ్ మారెళ్ళ వెంకటేశ్వరరావు, స్టేడియం మేనేజర్ సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా నిర్వహించటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి పాత పైపులైన్లు తీయకుండా రోడ్లు విస్తరణ పనులు చేయడం వల్ల లీకులు ఏర్పడి నీళ్లు రోడ్లపై పారుతున్నాయి. మురుగునీరు ఇళ్లలోకి వెళ్లి చుట్టు పక్కల వారికి తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. ప్రజలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటంలేదు. పట్టణంలో గాంధీ సెంటరు నుండి రామన్నపేట రోడ్డు, చందర్లపాడు రోడ్డు నుండి చందాపురం అండర్ పాస్ వరకు పనులు చేస్తున్నారు. రహదారులు పూర్తిగా ధ్వంసం చేసి కంకర, వెట్ మిక్స్ వేశారు. రెండు వైపులా రోడ్డు విస్తరణ సమయంలో ప్రొక్లెయిన్లతో తవ్వడం వల్ల తాగునీటి పైపులైన్లు పగిలి లీకు అవుతున్నాయి. ప్రధాన పైపులతో పాటు ఇళ్లకు వెళ్లే కుళాయి పైపులు శిథిలావస్థకు చేరి లీకులు ఏర్పడుతున్నా వాటిని బాగు చేయకకుండా రోడ్డు విస్తరణ పనులు చేయడం వల్ల మంచినీరు కలుషితమై మురుగునీరుగా మారుతున్నాయి. ప్రజలు ఈ కలుషిత నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో పాత పైపులు తీసి వేసి కొత్త పైపులు వేస్తే లీకులు ఏర్పడే సమస్య ఉండదని ప్రజలు అంటున్నారు. నందిగామ పట్టణానికి మంజూరు అయిన ఏసియన్ గ్రాంట్స్ రూ.89 కోట్లతో శాశ్వత మంచినీటి పథకం ద్వారా ఇంటింటికి మంచినీరు కుళాయిలు,


పైపులైన్లు లీకై రోడ్డుపై పొంగుతున్న మంచినీరు

ప్రధాన పైపులైన్లు మారుస్తామని నాయకులు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. శాశ్వత మంచినీటి పథకం కేవలం శంకుస్థాపనలు, శిలాఫలకాలకే పరిమితమైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త పైపులు వేసి రహదారులు విస్తరణ చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎఇని వివరణ కోరగా నందిగామలో రోడ్డు విస్తరణ పనుల్లో శాశ్వత మంచినీటి పథకం కొత్త పైపులైన్లు వేయటానికి రహదారి పక్కనే స్థలం వదిలిపెడుతున్నామని నందిగామ మున్సిపల్ ఎఇ ఫణి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాత పైపులైన్లు లీకులు సరి చేస్తున్నాముని చెప్పారు.

దుర్గమ్మకు సారె సమర్పణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఆషాడ మాసం సందర్భంగా మంగళవారం దుర్గమ్మకు పలువురు సారె సమర్పించారు.



అనంతరం మహామండపం ఆరో అంతస్తులో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. కనకదుర్గమ్మను కేరళ రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి జె.చించురాణి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటంను ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు బచ్చు మాధవీకృష్ణ, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి పి.చంద్రశేఖర్ అందజేశారు.

గౌస్ మొహిద్దీన్‌ను సిఎం అభినందన

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఎన్టీఆర్ జిల్లాలో 'హర్ దిల్ మే వైఎస్ఆర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ గౌస్ మొహిద్దీన్‌ను 'గౌస్ భాయ్ కీప్ ఇట్ అప్' అంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి మెచ్చుకున్నారు. జిల్లాలోని ప్రతీ మసీదు వద్దకు వెళ్లి 'హర్ దిల్ మే వైఎస్ఆర్-హమ్ సబ్



జగన్ కే సాత్' కార్యక్రమంలో భాగంగా విస్తతంగా పర్యటిస్తూ నాలుగేళ్ల ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ షేక్ గౌస్ మొహిద్దిన్‌ను సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి అభినందించారు. మంగళవారం నగరంలోని ఎ కన్వెన్షన్‌లో జరిగిన జగనన్న అణిముత్యాలు కార్యక్రమానికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌ను గౌస్ మొహిద్దిన్ కలిసిన సందర్భంలో గౌస్ మొహిద్దిన్‌ను సిఎం అభినందించారు. ఇదే పద్దతిలో ముందుకు సాగాలని గౌస్ కు సిఎం జగన్ సూచించారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయవాడ: అనారోగ్యం బారిన పడిన ఇద్దరు బాధితులకు సిఎం జగన్ ఆదేశాల మేరకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న విజయవాడ ప్రకాష్‌నగర్‌కు చెందిన గూడవలస శీలరాఘవేంద్రరావుకు, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న కృష్ణలంకకు చెందిన కొలుసు వెంకటకళ్యాణ్‌లకు రూ.లక్ష చొప్పున చెక్కులను కుటుంబ సభ్యులకు కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

జెఈఈ అన్ అకాడమి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: జెఈఈ అడ్వాన్స్ 2023 పరీక్షల్లో నగరంలోని అన్ అకాడమి విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని అకాడమి ప్రతినిధి విఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. టాప్ 100లో 11 ఆలిండియా ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. దేశాంక్ ప్రత్ అద్భుతమైన ప్రతిభతో ఆలిండియా 22వ ర్యాంకు, ధృవ్ జైన్ ఆలిండియా 36వ ర్యాంకు, శివాంశు కుమార్ ఆలిండియా 42వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

1 నుంచి 'జగనన్న సురక్ష' : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: వచ్చే నెల ఒకటి నుంచి ప్రారంభమవుతున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అధికారులు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో విజయవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ అన్నారు. స్థానిక తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అన్ని రకాలైన ధ్రువపత్రాలు, ప్రభుత్వ సేవలను అందించడానికి వచ్చే నెల 1 నుండి వారంలో మూడు రోజులు చొప్పున ఐదు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. దీనిలో వాలంటీర్లు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. వాలంటీర్లు క్లస్టర్లలో ఇంటింటికి తిరిగి ప్రజల అవసరాలు తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు (జనరల్) ఎం శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్టు) కెవి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ: ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి వి విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సర్కిల్-2 కార్యాలయంలో



మంగళవారం మొబైల్ కోర్టు జరిగింది. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న వారు, జనావాసాల్లోకి వస్తున్న పందుల యజమానులపై తదితర నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై 12 కేసులు నమోదు చేశారు. వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.8,840 జరిమానాను విధించారు.

అత్యాచారం కేసులో జైలు, జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ: మానసిక పరిస్థితి సరిగా లేని బాలికపై అత్యాచారం చేసిన కేసులో విజయవాడ పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి డాక్టర్ ఎస్.రజిని నిందితునికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.60 వేలు జరిమానా విధించారు. గన్నవరం కేసరపల్లికి చెందిన మహిళ తన కుటుంబ అవసరాల కోసం విజయవాడ బీసెంట్ రోడ్డులోని ఒక బట్టల షాప్‌లో పని చేస్తుండేది. కుమార్తె మానసిక పరిస్థితి సరిగా లేనందున తనతో పాటు షాపుకు తీసుకువచ్చేది. ఈ క్రమంలో 2017 జనవరి 9న బయటకు వెళ్లిన బాలికపై గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామానికి చెందిన ధరావత్తు భిక్షానాయక్ (భిక్షా) అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో నిందితునిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి మంగళవారం తీర్పునిచ్చారు.

రేపు మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ: మునిసిపల్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 22న విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉదయం 10.30 గంటలకు జరిగే ధర్నా కార్యక్రమంలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబస్ కోరారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందన్నారు. ఆప్కాస్ కార్మికులను కూడా పర్మినెంట్ చేయలేమని చెప్పడం దారుణమన్నారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులను


మాట్లాడుతున్న జ్యోతిబస్

మాత్రమే ప్రభుత్వం పర్మినెంట్ చేస్తామనడం ఎంత వరకు సమంజసమన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తుంగలో తొక్కారన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నగర ఉపాధ్యక్షురాలు టి తిరుపతమ్మ, నగర ఉపాధ్యక్షుడు హరిబాబు, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించాలి



ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రాధానగర్ జూనియర్ కళశాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించలేమంటూ ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేసారన్నారు. వైసిపి ప్రభుత్వంలో విద్యకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నామంటూ గొప్పగా చెప్పుకోవడమే తప్ప ఆచరణలో అది కనబడడంలేదన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించకపోగా విద్యార్థులు ఫీజులు ద్వారా చెల్లించిన ఇంటర్ విద్యామండలి నిధులు మొత్తం నాడునేడు పథకానికి దారి మళ్లించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, విజయవాడ సెంట్రల్ సిటీ నాయకులు మన్మధ, రాజకుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ ముసుగు తొలగింది : టిడిపి

విజయవాడ: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముద్రగడ పద్మనాభం రాసిన బహిరంగ లేఖతో వైసిపి మాటున దాచుకున్న కాపు ఉద్యమ ముసుగు తేటతెల్లమైందని టిడిపి



రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్ (నాగబాబు) అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో తుని ఘటనకు ముందు కాకినాడ వైసిపి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలతో సహా కొంతమంది నేతలు వ్యూహరచన చేశారని వారు రచించిన వ్యూహంలో భాగంగానే ఆనాడు తుని ఘటన జరిగిందని ఈనాటి ముద్రగడ లేఖతో స్పష్టమైందన్నారు. రేషన్ బియ్యం మాఫియా డాన్‌గా, గంజాయి పెంపకందారుడిగా ఉన్న ద్వారంపూడిని పొగుడుతూ లేఖలో రాసిన రాతలు ఏ జాతికోసమైతే ఉద్యమం చేశారో ఆ జాతే తలదించుకునేలా ఉందన్నారు.

బ్రావియా ఎక్స్ 75 టివి విడుదల

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

సోనీ ఇండియా ఆధ్వర్యంలో నూతనంగా అల్ట్రా హెచ్‌డి ఎల్‌ఈడీ టివి బ్రావియా ఎక్స్ 75 ఎల్‌ను విడుదల చేసినట్లు సోనీ సెంటర్ ఇన్‌ఛార్జి కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన సౌండ్, డాల్బీ ఆడియో, టెక్చర్స్‌తో వీక్షించే అవకాశం ఈటివిలో ఉంటుందని తెలిపారు. ఎక్స్ 75 ఎల్ సిరీస్ టీవీలు ఆటో హెచ్‌డిఆర్, టోన్ మ్యాపింగ్,ఆటో జెనర్ , పిక్చర్‌మోడ్, ఆటోలాటెన్సీ మోడ్‌లను కలిగి ఉందన్నారు. 43, 50, 55, 65 ఇంచ్‌లతో లభించే సోనీ బ్రావియాసిరీస్ టివిలు అన్ని సోనీ సెంటర్లు, ప్రదాన ఎలక్ట్రిక్ స్టోర్లులో లభ్యమవుతుందని తెలిపారు.

కివే బైక్‌లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఇండియన్ సూపర్ బైక్ పరిశ్రమలో ప్రముఖ తయారీదారు ఆదీశ్వర్ ఆటో రైడ్ ఇటీవలే రెండు నియో- రెట్రో ఓటార్ సైకిళ్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ ప్రతినిధి రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ఎస్‌ఆర్ 250, కివే ఎస్‌ఆర్ 125 బైక్‌లను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ రెండు బైక్‌లు జూన్ 17వ తేదీ నుండి డెలివరీలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బైక్‌లకు అద్భుతమైన స్పందన లభించడంతో రానున్న కాలంలో స్థానికంగా డీలర్‌షిప్ సెంటర్లను ఏర్పాటు చేసి మరింత చేరువ అయ్యే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

ద్వారంపూడికి ముద్రగడ వత్తాసు సరికాదు : పోతిన

ప్రజాశక్తి-వన్‌టౌన్

ద్వారంపూడి చంద్రశేఖర్‌కు ముద్రగడ పద్మనాభం వత్తాసు పలుకుతూ లేఖ విడుదల చేయడం దుర్మార్గమని జనసేన నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముద్రగడ వైసీపీకి అమ్ముడుపోయారని, 2019 నుండి కాపు ఉద్యమాన్ని అందుకే అటకెక్కించారని ఆరోపించారు. కాపు సంఘం ముసుగులో ఉంటూ సీఎం జగన్ కోసం, వైసీపీ కోసం, ద్వారంపూడి కోసం పని చేశారని విమర్శించారు.